# మనిషి చేసిన మేలు

పార్వతమ్మ కత్తిపీట ముందేసుకుని కూర తరుగుతూ కూర్చుంది. ఇవాళ లక్ష్మి పుట్టిన దినం. బంగాళాదుంపల కూర చెయ్యమని చెప్పి వెళ్ళింది. కూర, పులుసూ, కొబ్బరివచ్చడి, పాయసమూ చెయ్యాలి. ఇవాళతో లక్ష్మికి ఇరవై ఏళ్ళు నిండేయి, లక్ష్మి ఎం.ఏ, పాసయి. కాన్వొకేషన్‌కి వెళ్ళినప్పుడు తీసుకున్న ఫొటో గోడకు వేలాడుతోంది. పార్వతమ్మ తలెత్తి ఫొటోవేపు చూసింది. అచ్చు వాళ్ళ నాన్న మొహమే. యిరవై ఏళ్ళ క్రితం చనిపోయిన సుందర్రావు మొహం పార్వతమ్మకు సూచాయగా జ్ఞాపకం ఉంది. లక్ష్మి విశాలమైన కళ్లు. చాకుతో చెక్కినట్టుగా వుండే చక్కని ముక్కు చూసినప్పుడు పార్వతమ్మకు ఎప్పుడయినా ఒకసారి సుందర్రావు జ్ఞాపకమొస్తాడు. కాని ఆ జ్ఞాపకం ఆవిడ మనసులో ఒక తృటికాలం మాత్రమే వుండి మాయమవుతుంది. అప్పుడయినా ఆమెకు ఎలాంటి మనోవేదన కలగదు. రెండేళ్ళు కాపరంచేసి చనిపోయిన సుందర్రావు మీద ఆమెకు గాఢమైన మమకారం ఏర్పడలేదు.

సుందర్రావు చనిపోయినప్పుడు మాత్రం శానెంతో ఏడ్చింది. రెండు రోజులు అన్నం సయించలేదు. తన్నూ తన ఆర్నెల్ల పాప లక్ష్మినీ దిక్కులేని వాళ్ళను చేసి వెళ్ళిపోయినందుకే అంతగా ఏడ్చిందేమో ననిపించింది పార్వతమ్మకు, ఎందుకంటె పార్వతమ్మ భర్తను సంవత్సరం తిరక్కుండానే మరచిపోకలిగింది. ఔను మరి, బతికున్న వాళ్ళమీద మమకారం పెంచుకోవాలిగాని చనిపోయినవాళ్ళమీదకాదు.

ఈ ఇరవై ఏళ్ళ గతం ఆమె కళ్ళ ముందొక్కసారి మెదలింది. ఆమెకు జ్ఞాపకమున్నది ఈ యిరవై ఏళ్ళ గతమే. అంతకుముందుది

ఆమె జ్ఞాపకముంచు దలచుకోలేదు. ఈ యిరవై ఏళ్ళ గతం ఎంతో ఫలప్రదమైనదిగా, తృప్తికరమైనదిగా ఆమె జ్ఞాపకముంచుకుంది.

సుందర్రావు చనిపోయిన నాలుగో రోజునే తన అన్న దూర ప్రాంతంనుండి వచ్చి పరామర్శించి తిరుగుబాటుకి డబ్బు పంపుతానని చెప్పి వెళ్ళిపోయాడు డబ్బు పంపలేదు సరిగదా ఉత్తరం ముక్కకూడా వ్రాయలేదు. ఇంట్లోవున్న బియ్యం ఉప్పు పప్పు వీటితో ఒక నెల రోజులపాటు వండుకుని తిన్నది. తన దిక్కులేని జీవితం తలచు కుంటే ఆమెకు భయంవేసేది. లక్ష్మిని పెంచి పెద్దచెయాలి. అదెలా సాధ్యమా అని బెంగతో కుమిలిపోయేది. ఏదైనా పనిచేసుకుని తను బతకాలి, లక్ష్మిని పోషించాలి. మూడవ ఫారం వరకూ చదివిన తన కెవ్వరూ ఉద్యోగమివ్వరు. ఎప్పుడూ యింట్లోంచి బయటకెళ్ళే అల వాటు లేదు. కాని వెళ్ళక తప్పదు. ఆ వీధిలోనే ఉన్న ఒక పంతులు గారింట్లో పాచి పనికి కుదిరింది. వాళ్లకి వంటచేసి పెట్టేది, గిన్నెలు తోమిపెట్టేది. వాళ్ళిచ్చిన అన్నం తెచ్చుకుని తినేది.

తానుంటున్న గదికి అద్దె యెంతో తెలీదు. కాని రెండు మాసాలు గడిచినా ఇంటాయన అద్దెకోసం రాలేదు. ఇంటాయన ఎవరో తనకు తెలియదు. తానుంటున్న యిల్లు మూడు గదులభాగం. ఒక దర్జీపని వాడు అద్దెకు తీసుకున్నాడనీ అతనే ఒక గది ఏళ్ళకిచ్చాడనీ సూచాయగా తెలుసు. ముందుగదిలో అతని కుట్టుమిషనూ దుకాణమూ వుండేది. రెండవ గదిలో అతను వండుకుని తిని అక్కడే కుక్కి మంచంమీద పడుకునేవాడు. రాత్రుళ్ళు హార్మోనియం వాయిస్తూ నాటకం రాగాలు పాడేవాడు. ఆ రెండు గదుల తరువాత ఒక నడవ తరవాత తనగది.

మొదటి నెల పని చేశాక పంతులుగారింట్లో పదిరూపాయలు జీతమిచ్చారు. ఆ రోజు తనకెంతో ఆత్మ విశ్వాసం ఏర్పడింది. ఎంతో

సంతోషమేసింది. కాని తను యింటి అద్దె యివ్వాలి. పసిపిల్లకి పాలు కొనాలి. తనకి నూనె సబ్బులు మొదలైన చిల్లర వస్తువులు కావాలి. ఈ పది రూపాయలెందుకు చాలుతాయి మరో రెండిళ్ళల్లో పని దొరికితేతప్ప జరుగుబాటు కాదు.

ఇంటి అద్దె లేకుండా అక్కడుండడం మర్యాద కాదు. అయిదో ఆరో యిచ్చి మిగిలినది తరవాత యిస్తానని చెబితే ఒప్పుకోక పోతాడా? ఈ దర్జీ పనివాడు చాల మంచివాడిలాగనే కనిపిస్తున్నాడు. సుందర్రావు చనిపోయినప్పుడు అతనెంతో సాయం చేశాడు. అతనే ఆ వీధిలో వున్న బ్రాహ్మణ కుటుంబాల వాళ్ళనందరినీ పిలుచుకొచ్చి అంత్యక్రియలు జరిపించాడు అప్పుడే పంతులుగారి భార్యతో తనకు పరిచయమైంది. ఆవిడా, ఈ దర్జీ అయినా లేకపోతే తనగతే మయేదో.

ఆ రోజే తను తొలిసారిగా వీరాస్వామితో మాట్లాడడం. అయన వీధి గదిలో బట్టలు కుడుతున్నాడు. నేలమీద ఒక పదేళ్ళ కుర్రవాడు కూర్చుని చొక్కాలకు బొత్తాయిలు కుడుతున్నాడు. ఆరోజే తను అతన్ని స్పష్టంగా చూసింది. పొడుగ్గా చామనచాయగా ఉన్నాడు. ముఖం మీద అక్కడక్కడ స్ఫోటకపు మచ్చలున్నప్పటికీ వికారంగా లేదు. ఆరోజుల్లో నాటకపు వేషధారులకుండే పెద్ద జుత్తు. కాలరులేని చొక్కా, పైజమా వేసుకున్నాడు. తాను వీధివేపు వెళ్ళి గుండీలు కుట్టే కుర్రవాడిన్ని పిలిచింది.

గురువుగారూ పక్కింటి అమ్మగారెందుకో పిలుస్తున్నారు. వెళ్ళి కనుక్కురమ్మంటారా? అని వీరాస్వామి అనుమతికోసం నిలబడ్డాడు వాడు.

వెళ్ళరా ఏటి కావాలో అడిగిరా? కుర్రవాడు మెట్లమీంచి కిందికి ఒక దూకు దూకి "ఏం కావాలమ్మగారూ" అన్నాడు.

"ఇవాళ పంతులుగారింట్లో పది రూపాయలు జీతమిచ్చారు. అందులో ఇంటద్దెకింద యిప్పుడో అయిదు రూపాయలిస్తాను. మిగిలిన దెంతో చెబితే తరవాత యిచ్చుకుంటాను. ఈ సంగతి మీ అయ్యగారితో చెప్పు" అన్నాది తను.

"ఏం సెప్పమంటారు, ఇప్పుడు మీకాడ డబ్బు లేదని చెప్ప మంటారా?"

"అవును"

కుర్రవాడు వెళ్ళి వీరాస్వామితో "గురువుగారూ ఆ యమ్మ కాడి ప్పుడు డబ్బు లేదట అన్నాడు.

"డబ్బేమిట్రా వెధవా. అపడేం చెప్పారు. నువ్వేటి విన్నావు?"
"అదే గురువుగారూ"

"నీ మొహం, ఒరే మొద్దు వెధవా నువ్వెందుకూ పనికి రావురా అంటూ వీరాస్వామి మిషనాపి వీధిలోకొచ్చాడు.

"ఏంటమ్మగారూ ఏం కావాలి?" అన్నాడు.

"ఇవాళ నాకు పంతుగారింట్లో పది రూపాయలు జీతమిచ్చారు. అందులో ఇదుగో ఈ అయిదూ మీరు అద్దెకింద తీసుకోండి. మిగిలిన దెంతో చెపితే తరవాతిచ్చుకుంటాను. అన్నది తను.

"అదేంటమ్మగారూ. పదిరూపాయల్లో సగం నాకిస్తే ఇంక మీరేటి తింటారు. చంటిపిల్లకి పాలేటి కొంటారు ఇప్పుడక్కర్లేదు ఉంచండి మీదగ్గరున్నప్పుడే యిద్దురుగాని లెండి అన్నాడు వీరాస్వామి.

"నా దగ్గరుండడమనేది ఎప్పుడవుతుంది నాయనా? బాకీ పెరిగేకొద్దీ నే తీర్చుకోలేను తీసుకోండి బాబూ"

"మీ దగ్గర ఐదు రూపాయలు తీసుకోకపోతే నేను దరిద్రుణ్ణి అయిపోతానా చెప్పండి యింటంతటికీ పాతిక రూపాయలద్దె. ఆ గది నాకెలానూ వాడుక లేదు.

నువ్వు మాత్రం లక్షాధికారివా బాబూ, తీసుకో ఫరవాలేదు అంటూ అయిదురూపాయలనోటు అతని చేతికందించింది.

వీరాస్వామి నోటందుకుని జేబులో పెట్టుకుంటూ "లక్షాధికారిని కాదుగానీ, మీరు కష్టంలో వున్నారు గదా అని" అన్నాడు.

"ఈ అయిదూ వుంచుకుంటే మాత్రం నా కష్టాలు గట్టెక్కుతాయా బాబూ. వెళ్ళొస్తాను. నా పనికి వేళయింది అంటూ" తను పంతులు గారింటికి వెళ్ళింది.

తరువాత మరొక యింటిలో సాయంకాలం పూట పాత్రలు తోమి పెట్టేది. వాళ్లొక అయిదు రూపాయలిచ్చేవారు. ఇలా ఒక ఆరుమాసాలు గడిచాయి. ఈ ఆరు మాసాలలోనూ తాను వీరాస్వామితో మాట్లాడ లేదు వీధిలో నిలబడి కుర్రవాడిని పిలిచి అద్దె అయిదు రూపాయలు యిచ్చేది

కాని ఒకరోజు సాయంత్రం లక్ష్మికి జ్వరం తగిలింది. అదే పోతుందిలే అని ఊరుకుంది. కాని రాత్రి పదకొండుగంటలకి జ్వరం బాగా తీవ్రమైంది. ఒళ్ళు కాలిపోతూంది. పిల్ల ఊపిరి తియ్యలేక బాధపడుతూంది. పలకరిస్తే పలకడంలేదు. కళ్ళెత్తలేకపోతూంది తనకెంతో భయంవేసింది. తనకి దుఃఖం ముంచుకొచ్చింది. దేవుడికి దండం పెట్టుకుంది. "భగవంతుడా, నా పాపను కాపాడు తండ్రీ! దీన్ని పెంచి పెద్దదాన్ని చెయ్యడానికే నేనెన్ని కష్టాలయినా పడి బతుకుతున్నాను ప్రభూ! రక్షించు తండ్రీ" అంటూ రెండు చేతులూ జోడించి నమస్కరించింది. బయట చీకటిగా వుంది. గదిలో మినుకు మినుకు

మంటూ పొగబారిన లాంతరు వెలుగుతూంది. తన ఒడిలో లక్ష్మి జ్వరంతో ఒళ్ళు తెలికుండా మూలుగుతూంది. "ఈ రాత్రిగడుస్తుందా? భగవంతుడా నే నెవరికీ అన్యాయం చెయ్యలేదే. ఏ పాపమూ చెయ్య లేదే మరి నాకెందుకీ కష్టాలు తెచ్చి పెట్టావు తండ్రీ" అనుకుంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకుంది. వీధిలోంచి గాలి తెర ఒక్కఊపుగా లోపలి కొచ్చింది. దానితో దీవం ఆరిపోయింది. తనకు మరింత భయంవేసింది.

మెల్లగా పిల్లను చాపమీద పడుకోబెట్టి, లేచి అగ్గిపెట్టికోసం వెది కింది. అగ్గిపుల్ల తాసి మళ్ళీ దీవం వెలిగించింది. పిల్ల పరిస్థితి ఏమీ బాగులేదు. ఈ రాత్రి గడిచేటట్టుగా లేదు. ఎవరైనా వైద్యుడి దగ్గ రకు తీసుకుపోవాలి. కాని ఈ రాత్రవ్వుడు. ఈ చీకట్లో తాను ఎలా వెళ్ళగలదు.

ధైర్యంచేసి గదిలోంచి బయటి కొచ్చి వీరాస్వామి పడుకునే గది కిటికీ దగ్గరగా వెళ్ళి "బాబుగారూ" అని పిలిచింది. వీరాస్వామి హార్మోనియం వాయిద్యంలో లీనమైవున్నాడు. తను గట్టిగా రెండు సార్లు పిలిచేసరికి హార్మోనియం ఆగిపోయింది. వీరాస్వామి ఒంటిమీద తువ్వాలేసుకుని గదిలోంచి బయటి కొచ్చాడు. "ఏమిటి, మీరా అమ్మ గారూ, ఏటిలా వొచ్చారు, ఏటయిందీ?" అన్నాడు.

"పావకు చాలా జ్వరంగా వుంది బాబూ. ఊపిరి తియ్యలేక పోతూంది. ఎవరైనా డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలి" అన్నది.

" అయ్యో, అలాగా, వస్తున్నానుండండి." అంటూ లోపలికెళ్ళి చొక్కావేసుకుని వచ్చాడు. తన గదిలోకి వచ్చి పావను ఎత్తుకుని "యీ వీధి చివరిలోనే డాక్టరున్నాడు. తీసుకెల్తాను" అన్నాడు.

"పద బాబూ నేనూ వస్తాను" అంటూ తను కూడా బయలుదేరింది.

అదృష్ట వశాత్తు డాక్టరింకా నిద్రపోలేదు. పాపని పరీక్షించి ఒక ఇంజక్షనిచ్చాడు. మరేం భయంలేదనీ మర్నాడు పొద్దున్న తీసుకు రమ్మనీ చెప్పేడు.

మరో గంటసేపటికి పిల్ల కళ్ళు తెరిచింది. కొంచెం పాలు పడితే తాగింది. తనకు ప్రాణం తేలికయింది.

మరేం భయంలేదు, తగ్గిపోతుందని చెప్పారమ్మా డాక్టరుగారు. గాలి జల్లిందట. ఒక రెండు రోజుల్లో నయమయిపోతుంది. నే వెళ్ళి పడుకుంటాను. అవసరమయితే ఆ కిటికీ దగ్గరకొచ్చి పిలవండి. అని చెప్పి వీరాస్వామి వెళ్ళిపోయాడు.

మర్నాడు పొద్దున్నే వీరాస్వామి పాపకెలా ఉందని అడిగాడు. చాల నయంగా వుంది తను డాక్టరు దగ్గరకి తీసుకు వెల్తానని చెప్పింది.

"ఛ తప్పమ్మా, గాలి జల్లితే పాపని వీధిలోకి తీసుకెళ్ళగూడదు, మీరుండండి నే వెళ్ళి ఆయన్ని పిలుచుకొస్తాను అంటూ వెళ్ళి ఒక అర గంటలో డాక్టర్ని తీసుకొచ్చాడు. డాక్టరు పాపని పరీక్షించి ఏదో మందు రాసిచ్చాడు. మరేం భయం లేదు రెండు రోజుల్లో అదే పోతుం దని చెప్పి వెళ్ళిపోయాడు. తన దగ్గర ఒక నాలుగు రూపాయలుంటే వీరాస్వామి కిచ్చింది".

"ఫరవాలేదు వుంచండమ్మా నా దగ్గరుంది లెండి అన్నాడు. వీరా స్వామే వైద్యానికయిన ఖర్చంతా పెట్టేడు రెండు రోజుల్లో పాపకు పూర్తి ఆరోగ్యం చేకూరింది.

తరవాత వీరాస్వామి వచ్చి పాపనెత్తుకుని వెళ్ళి తన కొట్లో కూర్చోబెట్టుకునే వాడు దానికో గిలక ప్లాస్టిక్ బొమ్మ కొనితెచ్చాడు. మీరు పనికెళ్ళండమ్మా మేం చూసుకుంటాం పాపని అనేవాడు. పాపకి

కూడా వీరాస్వామి దగ్గర బాగా చనువయింది. అతను బట్టలు కట్టుకుంటూ వుంటే కత్తిరించిన గుడ్డపీలికలతో ఆడుకునేది పాప. చంటిపిల్ల అప్పుడప్పుడు నేల పాడుచేసేది. వీరాస్వామే చింకిగుడ్డ తెచ్చి శుభ్రం చేసేవాడు. పనిలేనప్పుడు పాపతో ఆడుకునేవాడు రాత్రి ఎనిమిది గంటలయినా పాప అక్కడే వుండేది. తనకు వీరాస్వామిని చూస్తే అసూయ కలిగేది. తన బిడ్డను తనకు కాకుండా చేస్తాడేమోనని భయం వేసేది. పాపకు తనే అన్నం పెట్టేవాడు. తనే బట్టలు కట్టి తొడిగేవాడు. వీరాస్వామి దగ్గరనుండి పాపను ఎలా తప్పించడమా అని తను ఆలోచించేది. పనిలోంచి తిరిగి వచ్చాక పాపలేకపోతే తనకేం తోచేదికాదు. పాప తన్ను మర్చిపోతే తనకేం దారి? పాపలేకుండా తాను ఒంటరి జీవితం భరించగలదా? అయినా సాయంకాలం తను యింటికొచ్చాక వీరాస్వామి పాపను తన కెందుకప్పజెప్పడు. అతనిమీద తనకెంతో కోపం వచ్చింది.

ఒకరోజు సాయంత్రం పనిలోంచి యింటికి వచ్చి పాపను తెచ్చుకోవడం కోసం దర్జీ కొట్టు దగ్గరకు వెళ్ళింది. పాప రాకపోతే వీరాస్వామి మొహంమీదే నాలుగు మాటలూ అనేద్దామనుకుంది.

వీరాస్వామి మిషను నడుపుతూ "అల్లుడా రమ్మని అదరమ్మన బిలువ" అంటూ గయోపాఖ్యానంలోని పద్యం రాగవరసని చదువుతున్నాడు పని కుర్రవాడు షర్టుకి కాజాలు కుట్టి వీరాస్వామికి చూపించాడు. వీరాస్వామి షర్టు కాజాలు పరీక్షించి శిష్యుడికి గురూపదేశం మొదలెట్టాడు. "ఒరే ఎదవా! ఆ బ్రహ్మ దేవుడు చేసిన మిస్టిక్ ఏమిటంటే నీ తలకాయలో మట్టి పెట్టి మూతేశాడు. లేకపోతే కాజాలిలాగట్రా కుడతావ్. ఈ షర్టు ఎవరిదనుకున్నావురా కుర్ర ఎదవా. మనప్లీడరు శివయ్యగారి తమ్ముడిది. ఆయన ఫారిన్ ఎళ్లొచ్చాడు తెలుసా? ఆయనీ

షర్టు చూస్తే ఏటనుకుంటాడు. ఈ అడివి టైలరు మనకెక్కడ దొరి
కాడ్రా దేవుడా అనుకుంటాడు. ఈ వీరాస్వామంటే ఏటనుకున్నావురా
కుర్ర ఎదవా! హోల్ మొత్తం పట్నానికే ఛాలెంజి టెయిలర్ తెలుసా.
మన పేరు సెదగొడతావేట్రా ఎదవా? ఇన్నాళ్ళయింది కాజాలు కుట్టడం
తెలియనోడివి కోటు కత్తిరించడమొచ్చే సరికి ముసిలాడివయిపోతావు
ముసలాడికి కళ్ళు కనబడవు. అడికెవరిస్తారు బట్టలు అంటారప్పుడు
ఇక నీ బతుకు కాజాలతో తెల్లారిపోవలసిందేర్నా. టైలరింగంటే
తమాషాలనుకున్నావా? షర్టు కుట్టామంటే సూడగానే ఇది ఫలానా టైలరే
నాకు కుట్టేడూ అని అడగాల తెలిసిందా? పనొచ్చినోడికే డబ్బుల్లేవురా
ఈ రోజుల్లో పనిరానోడు యిక అడుక్కు తినవలసిందే తెలుసా?
ఛ. బుద్ధితక్కువ ఎదవా, రా ఇలారా, బుర్రొంచు" అన్నాడు వీరాస్వామి,
కుర్రవాడు బుర్రవొంచితే వీరాస్వామి వాడి బుర్రమీదొక జెల్లకొట్టి "ఫో
వెధవా, కాజాలన్నీ విప్పు. మళ్ళీ తెల్లదారంతో నీటుగా కుట్టు. మళ్ళీ
యిలాంటి కల్తీ పని చేశావంటే ఎముకలిరగొడతాను తెలుసా" అని మళ్ళీ
తన మిషను తొక్కడం మొదలెట్టేడు.

తనకు నవ్వొచ్చింది. ఈ భావిటైలరుకు మంచి తర్ఫీదే ఇస్తు
న్నాడనుకుంది.

"ఒరే అబ్బాయి, పాపనిలా ఇయ్యరా అని కేకవేసింది. శిష్యుడు
నేల ఆడుకుంటున్న పాపని తీశాడు". అయ్యో. గురువుగారూ పాప ఒకటి
కెళ్ళిందండీ అన్నాడు. అరెరె వుండుండు నే తీస్తాలే, అంటూ తనుదుకాణం
లోకివెళ్ళింది". ఫరవాలేదమ్మా ఒరే పొట్టీ గుడ్డ పట్టుకురారా, ఎర్రి
మొగమేసుకు చూస్తావేటి? అన్నాడు వీరాస్వామి.

కూచోండమ్మా ఆడు తీస్తాడు లెండి

కుర్రవాడు గుడ్డతెచ్చి నేల తుడిచాడు. 'అమ్మగారూ చిన్న పాప,
రంగయ్య బాబు చొక్కాగుడ్డ తడిపేసింది అన్నాడు కుర్రవాడు నవ్వుతూ,

'అయ్యయ్యో మీ బట్టలన్నీ పాడవుతాయి బాబూ, మీకు మాటొ స్తుందో ఏమిటో' అంటూ పాపను తీసుకుంది.

'ఏటి లేదమ్మా చంటిపిల్ల దానికేం తెలుసు బట్టలు మనం జాగ్ర త్తగా వుంచుకుంటే సరీ' అన్నాడు పీరాస్వామి.

"అయినా మీరు పనిచేసుకునేచోట యీ చంటి పిల్లెందుకూ, రేపట్నుంచి నేను తీసుకుపోతాను" అన్నది తను కొంచెం విసుగ్గా.

"ఎక్కడికి "

"ఎక్కడి కేమిటి? నాతోబాటు పంతులు గారింటి కొస్తుంది. అక్కడది వసారాలో కూర్చుంటే నేను పనిచేసుకుంటాను. సాయంత్రం నాలుగ్గంటలకి యింటికే వెచ్చేస్తాను."

"సాయంత్రం కూడా పనిలోకి వెళ్ళతారుగా"

"లేదు, వెళ్ళడం లేదు."

"ఏం మానేశారా?"

"వాళ్ళే మాన్పించేశారు. పాపకు జగమొచ్చినప్పుడు ఓ రెండు రోజులు వెళ్ళలేదని పనితీసేశారు."

"ఏటీ, రెండు రోజులు పనిలోకెళ్ళకపోతే తీసేడమే. ఆ గుమాస్తా అలా అఫీ సెగ్గడుతునే వుంటాడు. అయన్ని తీసేశారా? ఏం అన్యాయమమ్మా—నాతో చెప్పేరుగాదు అళ్ళ మొహం మీదే గట్టిగా అడి గేద్దును" అన్నాడు పీరాస్వామి.

"అయినా మీకెందుకు లెండి బాబూ, నీకూ ఆవిడికీ ఏం సంబంధం అని అడుగుతారు."

పీరాస్వామి తలొంచుకున్నాడు. "అదీ నిజమే ననుకోండీ" అంటూ నసిగేడు.

తాను పాపనెత్తుకుని లేచి నిలబడింది.

వీరాస్వామి లేచి నిలబడ్డాడు. అతని మొహం చాలా దీనంగా కనిపించింది. "కాని ఇది అన్యాయమమ్మగారూ, రోజూ పాపని తీసుకెళ్ళిపోతామంటున్నారు. అదుంటే మా కిక్కడ చాలా సరదాగా గడచిపోతూంది. పాపకు నా దగ్గిరెంత చనువయిందనుకున్నారూ. చెబితే నమ్మరు, నన్నొక్క క్షణం వొదలదమ్మా" అన్నాడు.

తానేమీ మాట్లాడలేదు. "ఛీ! నీకూ దానికి ఏమిటి సంబంధం. నా పాపను చేరదియ్యడానికి నువ్వెవడివి" అని చివాట్లు పెడదామకుంది. కాని అశక్తుడిలా దీనంగా నిలుచున్న అతని మొహం చూసి ఏమీ మాట్లాడలేకపోయింది. యింతకీ అతనేం పాపం చేశాడు. పాపను చేరదీసి. దానికి సేవచెయ్యడమే అతని దోషమా? తన మనస్సంతా గందరగోళమైంది.

"సరేలెండి పొద్దున్నపూట వదిలేస్తాను. సాయంత్రం మూడు నాలుగ్గంటల కొచ్చి దీసుకుపోతాను"

"పోనీ మీరే వచ్చి సాయంత్రం వేళల్లో పాపతోబాటు ఇక్కడే కూర్చోరాదా-ఇంట్లో మీకేమీ పనిలేదుగా".

"దీనికితోడు నేనుకూడానా? మీ పని చెరుపుకా?"

"పనిచెరుపేముందమ్మా కావాలంటే మీరు పనిచెయ్యండి. ఇంకో యిద్దరు మనుషులొచ్చినా పనుందిక్కడ, మీ కభ్యంతరం లేకపోతే జాకెట్లు, గౌన్లు కత్తిరించడం నేర్పేస్తాను. నా కిప్పుడు షర్టులూ, సూట్లూ కుట్టడంతో తీరికలేక ఆడోళ్ళ బట్టలు కుట్టడం మానేశాను. మనం పని చెయ్యాలేగాని కావలసినంత వర్కొస్తుంది."

తానేమీ మాట్లాడలేదు. దీనికి జవాబు ఎలా చెప్పాలో తెలియలేదు. మళ్ళీ వీరాస్వామే అన్నాడు "ఆలోచించండమ్మా తొందరలేదు.

మీవంటి వారు అళ్ళింటోనో ఈళ్ళింటోనూ ఎంతకాలం పనిచేస్తారు. టైలరింగ్ పని కష్టమే కాని పట్టుబడిందంటే బంగారమే. రోజూ అయిదారు రూపాయలు కళ్ళ జూస్తారు. పోనీ మీకీ కొట్లో కూచోడం యిష్టం లేకపోతే మీ గదిలో కూర్చునే చెయ్యండి".

తనేమీ మాట్లాడకుండా పాపనెత్తుకుని తన యింట్లోకొచ్చేసింది. ఆ రాత్రి తనకు సరిగా నిద్రపట్టలేదు. వీరాస్వామి మాటలు తన చెవిలో యింకా వినబడుతున్నట్టుగానే వుంది. అవును ఎన్నాళ్ళు పది రూపాయల పాచిపని? ఈ పనితో పాపనెలా పెంచి పెద్దజెయ్యడం? దాన్నెలా చదివించడం? దారి తెలియని తన బతుక్కి తన భవిష్యత్తుకి వీరాస్వామి ఒకదారి చూపిస్తున్నాడు. కుట్టుపని నేర్చుకుంటే నెలకి నూరో రెండొందలో సంపాదిస్తే పాపకి ఏలోటూ రాకుండా గడుస్తుంది. అప్పుడే తనకి వీరాస్వామి మీద సదభిప్రాయం ఏర్పడింది.

తనకి విద్య అతిత్వరగా పట్టుబడింది. ఆరు మాసాల్లోనే జాకెట్లు కుట్టడం వచ్చేసింది. వీరాస్వామి తన గదిలో ఒక మిషను తెచ్చి పెట్టేడు.

వీరాస్వామి తనకప్పటినుంచి గురువు. మిత్రుడు. తన పాపకు గార్డియను. తను కుట్టుపని బాగా చేస్తున్నానని మెచ్చుకునే వాడు. రెండుపూట్లలోను వంట చేసేదాన్ని. అతను ఇంట్లోనే భోంచేసేవాడు. వీరాస్వామికి పని బాగా ఎక్కువగా రావడం మొదలయింది. పొట్టి కుర్రాడు అతననుకున్నంత మొద్దు కాడు. వాడు కూడా మిషను కుట్టు నేర్చేశాడు. వీరాస్వామీ కత్తిరించి యిస్తే వాడు కుట్టేవాడు, కొన్ని తానే కుట్టేది. మీరు మిషను ముట్టుకున్నారు మనకి చేతినిండా పనే. ఏటంటారమ్మగారూ, అన్నాడోరోజు.

"నన్ను అమ్మగారూ అని పిలవకండి నేను మీ శిష్యురాలిని" అన్నది తను నవ్వుతూ.

"సరే అయితే మీరు నన్ను బాబుగారూ అనకండి. వీరాస్వామి అనండి మా అమ్మ పెట్టిన పేరు మీకు నచ్చదేమో గాని"

నచ్చకపోవడ మేమిటి? మీ అమ్మగారు పెట్టిన పేరు బంగారం లాంటి పేరు అన్నది తను. అతను గట్టిగా పెంకులెగిరిపోయేలా నవ్వేడు.

వీరాస్వామి బట్టలు కత్తిరించి తన మీదా, పొట్టి కుర్రాడి మీదా వదేసి పాపనెత్తుకుని వెళ్ళి పోయేవాడు. దానితో ఆడుకునే వాడు. పాపకి అతని వద్ద ఎంతో చనువయింది. అప్పుడప్పుడు అతని భుజం మీదనే నిద్రపోయేది.

పాపకి అయిదో ఏడు రాగానే అతనే తీసుకెళ్ళి స్కూల్లో జాయిన్ చేశాడు ఒకప్పుడు పాపని అతనికి దూరం చేద్దామనుకున్న తనే అతనికెంతో దగ్గరయింది.

బతకడంలో ఉన్న మధురానుభూతిని తానప్పుడే అనుభవించింది వీరాస్వామి చదువుకున్నవాడు కాకపోయినా అతని సంస్కారమూ, దయార్ద్ర హృదయమూ తనను తబ్బిబ్బు చేశాయి ముద్దుగా ముచ్చటగా ఎదుగుతున్న లక్ష్మి తన మనస్సును అనురాగ జ్యోతిగా మార్చి తన జీవితాన్ని నిర్మలమైన వెలుగులతో నింపింది. వీరాస్వామి లక్ష్మి వీళ్ళిద్దరూ రెండు స్తంభాల్లా తన బతుకును ఆదుకుని జీవితం అనుభవించ దగినదనే నమ్మకం కలిగించారు. పచ్చని చెట్లలా తమ నీడలు పరచి, తను ఆ చల్లటి నీడల్లో తృప్తిగా ఉల్లాసంగా బ్రతికేందుకు అవకాశ మిచ్చారు.

ఊళ్ళో నలుగురూ తన గురించి ఏమనుకుంటున్నారనే చింత తన కెప్పుడూ ఉండేది కాదు. తను శుభ్రమైన బట్టలు కట్టుకుని, తల దువ్వుకుని, పౌడరు రాసుకుని ఎప్పుడయినా వీరాస్వామితో కలసి నాటకాలకి వెళ్ళేది. ఆ నాటకాల్లో వీరాస్వామి హార్మోనియం వాయించేవాడు.

నాటకం ముగిసేక నాటకంలో పాల్గొన్న వారిని పరిచయం చేసేటప్పుడు వీరాస్వామి కూడా స్టేజిమీద కొచ్చేవాడు. లక్ష్మి సంతోషం భరించలేక అమ్మా! నాన్న. నాన్నకి పూలదండేశారమ్మా. అని కేకే సేది. వీరాస్వామికి తన మనసులో మొట్టమొదట పువ్వులదండ వేసింది తనే. అతని జీవితాన్ని సువాసనలతో నింపింది తనే. అతను కూడా తనకు పూలదండ వేసి, తన నికృష్ట జీవితాన్ని గౌరవప్రదం చేసి మోడువారిన తన బతుకును చిగురింప చేశాడు అనుకునేది తను.

ఊళ్ళో వాళ్ళకు తనపట్ల నీచమైన అభిప్రాయం వున్నట్లు తనకు చూచాయగా తెలుసు. కాని వాళ్ళ అభిప్రాయాలను లక్ష్యపెట్టవలసిన అవసరం తనకేమీ కనిపించలేదు. లక్ష్య పెడితే సుందర్రావు చనిపోవడంతో నాశనమైన తన బతుకు వీళ్ళు బాగుచేసి నిలబెడతారా? తను నికృష్టంగా బతికితే వాళ్ళు తనచేత చాకిరీ చేయించుకుంటారు వీలయితే విలాస వస్తువుగా వాడుకోడానికి చూస్తారు. అందుకే లోకానికెదురు తిరిగి, పరిస్థితులనెదిరించి, తన సౌఖ్యాన్ని తానే వెదుక్కుంటూ దాన్ని సాధించుకున్నది.

నాలుగేళ్ళకి ఊళ్ళో వాళ్ళందరికీ తమ కాపరం వింత అనిపించ లేదు. క్రమంగా గతాన్ని మరచిపోయి వాస్తవానికి అలవాటు పడ్డారు.

లక్ష్మికి బాగా చదువు వచ్చింది. వీరాస్వామి మొదట్లో తానే లక్ష్మికి సంగీతం నేర్పడానికి ప్రయత్నించాడు. గాత్రం చాలామంచిది. రాగజ్ఞానం త్వరగా పట్టుబడుతూంది. అతను తన ప్రయత్నం మాని సంగీతం మాస్టరును పెట్టేడు. పదిహేనో ఏటకే రాగాలాపన. స్వర కల్పన అలవడ్డాయి. కీర్తనలు చక్కగా పాడేది. వీరాస్వామి లక్ష్మి రాగాలపన వింటూ తన్మయత్వం పొందేవాడు. "ఆహా! ఇదమ్మా సంగీతమంటే, మాదేం సంగీతం" అనేవాడు,

"అదేమిటి నాన్నా, దేని బాణీ దానిది ఒకదానితో ఒకటి ఎలా పోల్చగలం" అనేది లక్ష్మి. వాళ్ళిద్దరూ సంగీతచర్చలో పడేవారు. తనకు నిద్రొస్తూ వుండేది. "చాలింక, ఇవాళకా సంగీతం వదలిపెట్టి పడుకోండి. పొద్దున్నే లేవాలి" అంటూ తను కేకేసేది.

"అదుగోనమ్మా, మీ అమ్మకి చిరాకెత్తింది. ఇక లాభంలేదు" అనేనాడు వీరాస్వామి.

అంతా లేచి లైటార్పి పడుకునేవారు. "అమ్మా నాన్నకి సంగీత మంటే ఎంతో సరదా" అనేది లక్ష్మి. "అవునమ్మా" అని తను లక్ష్మిని దగ్గరగా తీసుకుని నిద్రపోయేది.

స్కూలు ఫైనలు అయేక లక్ష్మిని కాలేజీలో ప్రవేశపెట్టాడు వీరాస్వామి. లక్ష్మికి చదువు భారం ఎక్కువకావడంతో సంగీతం వదలి పెట్టేసింది. "ఈ వొచ్చిన సంగీతం చాలులే" అన్నాడు వీరాస్వామి. రాత్రుళ్ళు లాంతరు ముందు కూర్చున్న లక్ష్మి చదువుకుంటూవుంటే, దానిచదువుకి భంగం కలుగుతుందని తనుకూడా హార్మోనియం వాయించ డం మానేసి, తనకేం బోధపడకపోయినా, లక్ష్మి పక్కనే కూర్చునేవాడు లక్ష్మి ఎం. ఏ. ప్యాసయే వరకూ తను అలానే లక్ష్మి చదువుకుం టున్నప్పుడు పక్కనే కూర్చునేవాడు. లక్ష్మి ఎం. ఏ. ఫస్టు క్లాసులో పాసయిందని తెలిసినరోజున వీరాస్వామి సంతోషానికి హద్దులేకుండా పోయింది. తనకూ లక్ష్మికీ క్రొత్తచీరలు కొని తెచ్చాడు. పొట్టికుర్రాడికి చొక్కా నిక్కరూ కత్తిరించి "పొట్టీ, కుట్టుకోరా, ఇయాల మా ఇంట్లో పండుగరా" అన్నాడు. "ఏంటి గురూగారూ, ఏంటయింది" అని అడిగాడు పొట్టికుర్రాడు, "ఏటా, ఎర్రిమొగమా, ఇంకా తెలీదా, లక్ష్మి ఎం.ఏ. పాసయిందిరా" అన్నాడు. "అబ్బా ఎం.ఏ" అంటూ ఆశ్చర్యపోయాడు వాడు.

ఆ రోజు వీరాస్వామి ఒక పూలచెండు తెచ్చి తనతలలో పెట్టేడు. "ఛీ ఏమిటా సరసం. సిగ్గులేదూ" అన్నాది తను. "పార్వతమ్మా! ఇవాళ నాకెంతో సంతోషంగా వుంది. నా కూతురు ఎం. ఏ, ప్యాసయింది అన్నాడు.

అవును వీరాస్వామీ లక్ష్మి నీ కూతురే కనడం మాత్రమే నేను కన్నాను. దానికి సంగీతం చెప్పించి గురువుగా తండ్రిగా దాన్ని పెంచి నువ్వే పెద్ద చేశావు అంటూ తాను ఆనందంతో కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"కాని పార్వతమ్మా నువ్వు ధైర్యంగా లోకాన్నెదిరించి నిలబడక పోతే నేనేమీ చెయ్యలేక పోయేవాడిని, లోకులేమనుకుంటారో అని నువ్వు జడసిపోయుంటే లక్ష్మి బతుకు అధ్వాన్నమయి పోయేది అన్నాడు. అవును అతనన్నమాట నిజమే. తనూ వీరాస్వామి లక్ష్మిని ఒక మనిషిగా తీర్చిదిద్ది తమ బతుకులు సార్థకం చేసుకున్నారు. ఇప్పుడు విద్యావంతురాలై ఉద్యోగం చేస్తూంది,

పార్వతమ్మ కూర తరగడం పూర్తి చేసి చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"ఏంటి పార్వతమ్మా. ఇవాళ పాప పుట్టిన రోజు ఏం వండుతున్నా వేంటి?" అనుకుంటూ వచ్చాడు వీరాస్వామి. వీరాస్వామికి వార్థక్యం దగ్గర కొచ్చేసింది. జుట్టు నెరసి పోయింది. బట్టలు కుట్టి కుట్టి దృష్టి మందగించింది. లక్ష్మి చంటిపిల్లగా వున్నపుడు వీరాస్వామి వయసెంతో తనకు తెలీదు కాని మంచి దృఢంగా ఆరోగ్యంగా వుండేవాడు. లక్ష్మి తన చేతుల్లోనే పెరిగి పెద్దదయినట్టుగా వీరాస్వామి కూడా తన చేతుల్లోనే వృద్ధుడయి నట్టుగా అనిపించింది పార్వతమ్మకు.

"ఇవాళ, లక్ష్మి ఎవరో ఇద్దర్ని భోజనానికి పిలిచిందట. బంగాళ

దుంపలకూర, కొబ్బరి పచ్చడి, పులుసూ, పాయసం చేస్తున్నాను అంది పార్వతమ్మ.

"అలాగ, సరేగానీ బంగాళా దుంప కూరలో మసాలా వెయ్యి. మాంసం కూరలా ఘుమ ఘుమ లాడుతుంది". అన్నాడు వీరాస్వామి

"ఛీ, నువ్వు మాంసం తినడం మానేసి ఇరవై ఏళ్ళయినా దానిమీద నీకింకా మమకారం పోయినట్టు లేదు".

'ఏదో తమాషా కన్నాను లేవే నేనా రుచే మరచిపోయాను.'

"నేనంటే కాయగూరలు తినే కులం దాన్ని కావి నువ్వెందుకు మానుకోవాలీ అంతగా తినాలనుంటే హోటలుకు పోయి తిను. నే వద్దన్నానా?"

"అబ్బ! ఏదో సరదా కన్నాను దానికింత గొడవ చేస్తున్నావు. అమ్మాయికూడా యిష్టమే కదా కొంచెం మసాలా వెయ్యి అన్నానంతే"

'వేస్తాలేవయ్యా ముసలై పోయినా నీకింకా కోరికలు చావలేదు.

'నువ్వూ ముసలై పోయినావు అయినా నీకూ వున్నాయి కోరికలు, అంటూ నవ్వేడు వీరాస్వామి.

"ఛీ సిగ్గులేదూ, ఏమిటా వాగుడు".

"తిట్టకే పార్వతమ్మా మనకింకా ఏం కోరికలే. మన కోరికలన్నీ తీరిపోయాయి".

"అవును వీరాస్వామీ, మన బతుకులయిపోయాయి. మనమింక అమ్మాయి కోసమే బతకాలి. దాన్నో యింటిదాన్ని చెయ్యాలి".

"అయితే నేనో కండీషన్ పెడతాను తెలుసా ఆ అల్లుడొచ్చి మనింటోనే వుండాలి".

"వాడుండకపోతే"

"అలావుండే వాడ్నే తీసుకొస్తాం లేకపోతే మనం దాన్ని వొదిలి ఉండగలమా"

అవును నిజమే, లక్ష్మి సాయంత్రం ఒక గంట ఆలస్యంగా యింటికి వస్తే వీరాస్వామికేమి తోచే కాదు. వదిసార్లడుగుతాడు.

"ఇదిగో పార్వతమ్మా" పాప పుట్టిన రోజుకి కొన్న చీర బాగుందా?"

"చాలా బావుంది".

ఇంతలో లక్ష్మి మరొకిద్దర్ని వెంటబెట్టుకుని వచ్చింది "నాన్నా నా ఫ్రెండ్స్ వచ్చారు నాన్నా" అంటూ వచ్చిన వాళ్ళని పరిచయం చేసింది. వాళ్ళిద్దరూ వీరాస్వామికీ నమస్కారం చేశారు. వారిద్దరిలో ఒకరులక్ష్మి స్నేహితురాలు సుగుణ లక్ష్మి పనిచేసే స్కూల్లోనే టీచరుగా పనిచేస్తూంది. రెండో మనిషి రామారావు, ఎమ్. ఏ. లక్ష్మితోనే చదువుకున్నాడు. అందంగా ఆరోగ్యంగానే వున్నాడు. సుగుణ, లక్ష్మి పార్వతమ్మతో కలిసి వడ్డనకు ప్రయత్నాలు చేస్తున్నారు, పార్వతమ్మకు సుగుణ డదివరకే తెలుసు, లక్ష్మితో అప్పుడప్పుడు ఇంటికి వచ్చేది. చాల బుద్ధిమంతురాలు. తనకేగాని కొడుకుంటే తప్పకుండా సుగుణను కోడలిగా తెచ్చుకుని వుండేదాన్ని అనుకునేది పార్వతమ్మ రామారావును మాత్రం ఆపడిదివరకెప్పుడూ చూడలేదు. వీరాస్వామి రామారావును భోగట్టాలడుగుతున్నాడు.

"మీదీవూరేనా బాబూ. మీ అమ్మగారూ నాన్నగారూ వున్నారా?"

తనది పొరుగునున్న గ్రామమనీ, తన తల్లి తండ్రీ అక్కడే వున్నారనీ, ఉద్యోగ ప్రయత్నం మీద యిక్కడున్నాననీ చెప్పేడు రామారావు.

అంతట్లో లక్ష్మి వచ్చి "వీళ్ళకి పొలమూ, ఇల్లూ వాకిలీ అన్నీ వున్నాయి నాన్నా. ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు," అన్నది.

"కాని ఏదో పనంటూ వుండాలికదండీ పనీపాటా లేకపోతే తోచక పనున్న వాళ్ళను చెడగొట్టే ప్రమాదముంది" అన్నాడు రామారావు.

అంతా భోజనానికి కూర్చున్నారు. పార్వతమ్మ వడ్డనచేస్తూంది. సుగుణ, లక్ష్మి కలసి రామారావును పరిహాసం చేస్తున్నారు. రామారావు కూడా మంచి సంభాషణా చాతుర్యం కలవాడే.

"అమ్మా, రామారావుగారికి బంగళాదుంపలంటే మంచి యిష్టం. కూరైనా సరే, పచ్చిదుంపలైనా సరే" అన్నది లక్ష్మి. అంతా గొల్లున నవ్వేరు.

"ఏమిటమ్మా పాపం అతన్నలా వేళాకోళం చేస్తావు అబ్బాయి మంచివాడు కాబట్టి సరిపోయింది" అన్నాది పార్వతమ్మ

"చూడండమ్మగారూ మీ అమ్మాయిననో్న ఆకివి మనిషికింద జమకట్టేసింది" అన్నాడు రామారావు.

"అవున్నాయనా, దాని పెంకితనం మరదక్కు చినప్పటినుంచీ అంతే అది" అన్నది పార్వతమ్మ.

"ఈయన కాలేజీలో మంచి వక్తగా పేరు పొందేరు నాన్నా. మేము బి. ఏ, చదివేటప్పుడు. డిబేటింగ్ కంటెస్టులో పాల్గొన్నాము. స్త్రీలు ఉద్యోగాలు చెయ్యాలా అక్కర్లేదా అన్నది విషయం నేడు మరొ ఇదరం చెయ్యాలనీ, ఈయన మరొకిద్దరూ అక్కర్లేదనీ వాదించాము. రామారావుగారు చాలా బాగా వాదించారు. ప్రెయిజు ఆయనకే వస్తుం దనుకున్నాము. కాని మేము మాత్రం ఊరుకున్నామా మేమూ గట్టిగా

వాదించాము. చివరికి ప్రెయిజు మాకే వచ్చింది, తరవాత రామారావు గారొచ్చి అభినందిచారు ".

"మీకు ప్రెయిజు రావడం న్యాయమేనమ్మా! అదేమిటి మొగేమిటి అంతా పని చెయ్యవలసిందే" అన్నాడు వీరాస్వామి.

"అదీ నిజమే నాన్నా! జడ్జీలు కూడా నీ లాగే అనుకుని వుంటారు. ఎందుకంటే వాదన చూసి యిచ్చేటట్లయితే ప్రెయిజు రామారావుకి వెళ్ళవలసిందే. ఆయన యూనివర్శిటీ ఛాంపియన్ కదా" అన్నది లక్ష్మి.

అయితే ఆయన వకీలు పరీక్ష చదివితే పోయేదే అన్నాడు వీరాస్వామి.

ఆయనేది చదివినా అందులో ఫస్టే నాన్నా. ప్రతి విషయాన్ని కూలంకషంగా చర్చిస్తారు. ఎం, ఏ,లో అర్థిక శాస్త్రం మీద ఎన్ని పుస్తకాలు చదివారో లెక్కలేదు. ఆయన వ్రాసిన వ్యాసాలు చూసి మా ప్రొఫెసరే ఆశ్చర్యపోయేవారు. ఆయన తయారుచేసుకున్న నోట్సు చదివే నేను ఫస్టుక్లాసు తెచ్చుకున్నాను" అంది లక్ష్మి.

"ఇదేమిటి? కొంత సేపు నేను అవిటిమనిషినని వేళాకోళం చేశారు. ఇప్పుడేమో మహా మేధావినంటున్నారు. ఏది నమ్మదమో తెలియకుండా వుంది" అన్నాడు రామారావు.

"రెండోదే నమ్మదగినది నాయనా, అయితేనువ్వు మాఅమ్మాయికి గురువుగారివి కూడా నన్నమాట అన్నది పార్వతమ్మ."

"ఆ, నీకు నేను గురువునయినట్లే"అని హాస్యమాడేడువీరాస్వామి. అంతా నవ్వుకున్నారు. పార్వతమ్మ పనస తొనలు పళ్ళెంలో పెట్టి తెచ్చింది.

"అమ్మా, రామారావుగారికి పనసపండంటే చాలా ఇష్టం. మేమంతా తొనలు తింటాం గాని ఆయన మొత్తం పండే తినేస్తారు" అన్నది లక్ష్మి.

"చూడండమ్మగారూ, మళ్ళా మొదటికొచ్చింది వ్యవహారం" అన్నాడు రామారావు.

పార్వతమ్మ నవ్వుతూ "దానితో ఏమిటిలే నాయనా! అదొక పెంకి పిల్ల" అన్నది.

"చూడు నాన్నా, అమ్మ రామారావుగారికి గొప్ప సపోర్టిచ్చేస్తున్నాది" అంది లక్ష్మి. అంతా నవ్వులాటగా మారింది. సుగుణ చేతి గడియారం చూసి తొమ్మిదయిందన్నాది.

"అమ్మో తొమ్మిదే పదండి. అమ్మా ఇవాళ మేము సెకండ్ షో సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం." అంటూ లేచి నిలబడింది లక్ష్మి. వీరాస్వామినీ పార్వతమ్మనీ కూడా సినిమాకి రమ్మని పిలిచాడు రామారావు. కాని వాళ్ళు రాలేమన్నారు.

"రాత్రి చాలా ఆలస్యమౌతుంది. అమ్మాయినింటి దగ్గిర దిగబెట్టి నాయనా అంది పార్వతమ్మ.

ఆయన గొప్ప భయస్థుడమ్మా ఆయన్ని మేం దిగబెట్టాలి" అన్నది లక్ష్మి. "అమ్మా ఇవాళ సుగుణ కూడా మనింట్లో పడుకుంటుంది" అని చెప్పింది లక్ష్మి. ముగ్గురూ రెండో ఆటకి వెళ్ళేరు.

"పార్వతమ్మా ఈ అబ్బాయి బుద్ధిమంతుడులాగే వున్నాడుసుమా" అన్నాడు వీరాస్వామి.

"ఏమో అప్పుడే ఏం తెలుస్తుంది. ఆడపిల్ల బుట్టలో పడేవరకూ అందరూ బుద్ధిమంతుల్లాగే వుంటారయ్యా తరవాత తెలియాలి అసలు

రంగు. మొదట్లో నువ్వూ బుద్ధిమంతుడివేగా". అంటూ నవ్వింది పార్వతమ్మ.

"ఇప్పుడు మాత్రమే మయిందేం? బుద్ధిగా లేనా? నువ్వు నన్ను కుక్కని తిప్పినట్టు తిప్పుతున్నావుగా.

''నువ్వూ తిప్పుకుంటున్నావు నన్నో పిల్లిలాగా" వీరాస్వామి పెంకు లెగిరిపోయేటట్టు నవ్వేడు. పార్వతమ్మ కూడా గట్టిగా నవ్వింది. వాళ్ళ నవ్వులో గడచిన ఇరవై ఏళ్ళ జీవితంలో అనుభవించిన సంతృప్తి ఆనందమూ వెల్లడయాయి.

మర్నాడు సింహాద్రి "నా చొక్కా కుట్టడమయిపోయిందా" అనుకుంటూ కొట్లోకొచ్చాడు. సింహాద్రి ఊళ్ళో ఒక వ్యాపారస్థుడు. వయసు నలభై అయిదేళ్ళుంటాయి. చామన చాయగా, లావుగా, పొట్టిగా వుంటాడు. బట్టతల వల్ల బుర్రమీద వెంట్రుకలు లేవు గాని ఇంట్లో బోలెడు డబ్బుంది. పొట్ట చీరితే అక్షరం లేదుగాని రెండంతస్థుల మేడ వుంది. చర్మం ఊడదీసి చూపినా ఎక్కడా మంచితనమనేది లేదుగాని ఊళ్ళో మంచి వడ్డీ వ్యాపారముంది. దేవుడిచ్చిన కళ్ళున్నాయి గాని ఆ కళ్ళ కందరూ కనబడరు. తనకుపయోగ పడేవాళ్ళే కనిపిస్తారు. చేతు లున్నాయి గాని ఆ చేతులు మనుషుల్ని నాశనం చెయ్యడమే గాని ఏనాడూ ఎవరినీ బాగుచేసిన పాపాన పోవు. కాళ్ళున్నాయి గాని అవి యింట్లో తప్ప బయట పడవ్వు (సింహాద్రికి లాంబ్రెట్టా స్కూటరుంది) అతని బుద్ధి చాకులాంటిది మంచి పదునైంది. వస్తువు ఎక్కడ మెత్తగా వున్నదీ చప్పున తెలుసుకుని అక్కడ కోత పెట్టగలడు. ఎదటి వాడి కళ్ళలోకి చూసి వీడి పెళ్ళాం బతికుందా చచ్చిందా. దాని శ్రాద్ధకర్మకి వీడి దగ్గర డబ్బుందా లేదా చప్పున నిర్ణయించగలడు. ఎదటి వాడి మొహం చూసి వీడి ఇల్లు తగలబడిందో లేదో వీడి పెళ్ళానికి క్షయ

వ్యాధి పట్టుకుందో లేదో వీడింట్లో తింటానికి బియ్యం గింజలున్నాయో లేవో, వీడి పిల్లలకి బడి జీతాలు కట్టాడో లేదో చప్పున పోల్చుకోగలదు.

"ఏం వీరాస్వామి బావా! నా చొక్కా కుట్టేవా" లేదా అంటూ సింహాద్రి కొట్లోకొచ్చి బల్ల మీద కూర్చున్నాడు.

"ఆ కుట్టడమయింది గానీ యింకా యిస్త్రీ చెయ్యలేదు. ఇప్పుడే మరీ అర్జంటయితే కూర్చో. ఇస్త్రీ పెట్టి వెలిగిస్తాను. లేకపోతే సాయం త్రం మొచ్చి తీసుకెళ్ళు".

"మళ్ళీ సాయంకాలం వస్తాలే. అయినా ప్రతిదీ వాయిదా వెయ్య డంలో నీ తరువాతే".

"అంటే ఏమిటయ్యా నీ ఉద్దేశం ?"

''ఏం లేదులే, ఏదో తమాషాకన్నా''

"అదృష్ట వంతుడివి, ఎన్ని తమాషా లేనా చేస్తావు"

ఎవరైనా అదృష్టం పేరెత్తితే సింహాద్రి వేదాంతపరమైన చిన్న లెక్చరిస్తూ వుంటాడు. "అదృష్టం దురదృష్టం ఏదైనా మన సేతిలో ఏటుం దయ్యా వీరాస్వామీ. అంతా ఆ ఆంజనేయస్వామి చలవే అనుకో. ఆ స్వామి చలవవుంటే మేడలు కడతావు. లేకపోతే మన్నై పోతావు. ప్రతి మంగళవారం టెంకాయెందుకు కొడతాననుకున్నావ్ మరి? తోటలో కాసిన కాయలే అనుకో. అయినా డబ్బు కాదేటి? ఇప్పుడు కాయ యాభై అరవై పైసలమ్ముతూంది తెల్సా? కొబ్బరి పంటంటే ఏటి, బంగారమే అనుకో అయినా వారం వారం ఆ స్వామికి కొబ్బరి కాయ కొట్టాల్సిందే. ఆయన దయ లేకపోతే పదెకరాల పొలం ముప్ప యెకరాలెలా అయింది? సైకిలు స్కూటరుగా ఎలా మారింది? ముప్పయి వేల రూపాయలు వడ్డీలకెలా తిప్పుతున్నానంటావ్? అంతా ఆ స్వామి చలవేనయ్యా. లేకపోతే ఊళ్ళో ఇంతమంది దరిద్రులెందుకుంటారు. ఆళ్ల మవకాడికి అప్పుల కెందుకొస్తారు? ఆ స్వామి చలవ మన మీదుం

చేసే కదా ఊరోళ్లు అళ్ళ పెళ్ళాల చెవుల తమ్మెట్లు తెచ్చి మనకాడ తాకెట్టెడతారు ఏమంటావ్? అంతా ఆ స్వామి చలవేనయ్యా. లేకపోతే నువ్వు బతుకంతా మిషను కుట్టుకుంటున్నట్లుగా నేను చింతపండు వ్యాపారం చేసుకుంటూ వుండేవాడ్నే. ఏమంటావ్? ఏం వీరాస్వామీ, వింటున్నావా లేకపోతే నీ మానాన్న నువ్వు మిషను కుట్టుకుంటున్నావా,

"వింటున్నానయ్యా-నువ్వన్నది నిజమేలే. రూపాయకి పావలాలు వడ్డీ పుచ్చుకునే వాళ్ళమీదే వుంటుందా దేవుడిదయ. చొక్కా కుట్టి రూపాయి కూలి పుచ్చుకొనే వాళ్ళమీదెందుకుంటుంది?" అన్నాడు వీరాస్వామి తన వేదాంతోపన్యాసం మీద వీరాస్వామి వ్యాఖ్య సింహాద్రికి నచ్చలేదు.

"ఛీ, నీకు దేవుడూ లేడు. దెయ్యమూ లేదు అందుకే అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగే వున్నావు. ఆ దేవుడందుకే మనిషిని చూసి డబ్బిస్తాడు. కనిపించిన ప్రతి వాడికీ యిచ్చేస్తాడా?"

"ఇవ్వడయ్యా. నీలాంటి వాడికే యిస్తాడు".

"అద్గదీ అలా అను. వీరాస్వామీ నాకు డబ్బుకేం లోటులేదు. కానీ.... "

'ఇంకా మరి కానీ ఏమిటి?"

"నీకు తెలుసుకదా నా పెళ్ళాం చచ్చిపోయి ఏడాదయింది."

"డబ్బున్నవాడికి పెళ్ళాం చచ్చిపోతే లోటేమిటి? ఇంకో పెళ్ళాన్ని కొనుక్కు రావచ్చుగా?"

"ఛ, అదికాదయ్యా నేననేది, నువ్వూ నేనూ ఓ కులస్థులం. అక్కయ్య పేరేకులందే అనుకో. అయినా మీ రిద్దరూ భార్యాభర్తల్లాగ మర్యాదగా కాపరం చేస్తున్నారు. ఇంతకీ నా కలాంటి పట్టింపులేం

లేవు సుమా! మీ అమ్మాయి కమల బుద్ధిమంతురాలు, చదువుకుంది పెళ్ళి చేసుకోడానికి నాకేం అభ్యంతరం లేదు" అంటూ మెల్లగా తన మనసులోని ఉద్దేశం బయట పెట్టేడు సింహాద్రి.

"నీ కభ్యంతరం లేకపోవచ్చు కాని మాకుంది" అన్నాడు వీరాస్వామి ప్రతిమాట నొక్కి పలుకుతూ. సింహాద్రి ఇలాంటి జవాబు వస్తుందని అనుకోలేదు. తనంతగొప్ప వాడు కోరి పిల్లనడిగితే ఎగిరి గంతేసి ఒప్పేసుకుంటాడనుకున్నాడు. సింహాద్రి బుర్ర చాకులా పదునైనదేగాని చాకనేది ఎలా నీరు, గాలి మొదలైన పదార్థాలను కొయ్యలేదో, అలాగే తనతో ఏకీభవించని వాళ్ళనీ, తన స్వార్థానికి ఉపయోగ పడని వాళ్ళనీ అర్థం చేసుకోలేదు. అందుకనే అతనికి విపరీతంగా కోపం వచ్చింది.

"ఏం ఎందుకనీ? మీకేం తీపిదిగేసిందా ఏభై వేల రూపాయల ఆస్తి పరుడ్ని అల్లుడుగా నువ్వెక్కడైనా తేగలవా? నాకేటి లోటని? ఇంతకీ మీరేటి సూసుకుని విర్రవీగుతున్నారని? నీ కూతురు సదుకుందనా మీ గర్వం. వీరాస్వామీ నేచెప్పేది ఇను, చదువుకువోడి కంటె చాకలాడు మేలని ఎందుకన్నారు మనోళ్ళు. నాకు చదువులేదు నిజమే, అయితేనేం? నాకున్న వ్యవహారజ్ఞానం ఎవరి కుందయ్యా ఎన్నిదావాలు గెలిచానూ, ఎంత మందిని కట్టుకొచ్చానూ, ఎంతవ్యాపారం చేస్తున్నానూ "ఏమైనా ఆలోచించావా? నీ కూతురు చదువుకుంది నిజమే కాని ఏటి సేస్తాంది, పంతులమ్మ ఉద్యోగం సేస్తాంది, రేపొద్దున్న నేను ఎన్నికలల్లో నిలబడతాను, మెంబరయి తీరుతాను. అప్పుడిలాంటి పంతులమ్మ లరడజను మందికి ఉద్యోగాలే యిస్తాను తెలుసా?" అంటూ సింహాద్రి శపథం చేశాడు.

"సింహాద్రి, ఎందుకొచ్చిన వాదనిదంతా చెప్పు. అది విను

చస్తే చేసుకోదు. పిల్ల దానికిష్టంలేని పెళ్ళి నేను చెయ్యను". అన్నాడు. వీరాస్వామి.

సింహాద్రికి ఒళ్ళు మండింది. తన వేదాంతోపన్యాసమూ మంచి మాటలూ ఏమీ ఈ వీరాస్వామి దగ్గర పనిచెయ్యవు. ఇక బెదిరిస్తే కాని జరగదనుకున్నాడు.

"అయితే చెయ్యనంటావ్. ఓహో సరే, నీ మొండి పట్టుద లేమిటో నేనూ చూస్తాను".

"ఏం, పీక తీసేస్తావేంటి? "

" అదే, అదే, నీ కూతురికి పెళ్ళెలా చేస్తావో నేను చూడనా? నీ సంసారం గుట్టంతా నాకు తెలీదా? పార్వతమ్మ మొగుడు చచ్చిపోయాక చంటిపిల్లతో నీ దగ్గర చేరడం, మీరు పెళ్ళి పేరంటం లేకుండా కాపరం వెలిగించడం-యిదంతా నాకు తెలీదనుకున్నావా? " అని సింహాద్రి అనగానే, వీరాస్వామి మిషనాపి లోపలి కెళ్ళాడు.

పార్వతమ్మ ఈ మాటలన్నీ గదిలోంచే వింటూ బయటికొచ్చింది ఆవిడ సింహాద్రిని పురుగుని చూసినట్టు చూస్తూ " ఛీ, నోరుముయ్యి నీ కెందుకు మా గొడవ? నువ్వు మమ్మల్నేం పోషిస్తున్నావా? అంత మర్యాదలేని వాళ్ళమైనప్పుడు మా పిల్లని చేసుకుంటానని ఎందు కొచ్చావ్? వెళ్ళు బయటికి నడువు ముందు" అంటూ కోపంతో ద్వారం వేపు చెయ్యి చూపించింది. ఇంతలో వీరాస్వామి లోపలి నుంచో కర్ర పట్టుకుని వచ్చాడు.

" వెళతాలే అమ్మా, ఇదంతా మీ మంచి కోసమే చెబుతున్నాను" అంటూ సింహాద్రి వీరాస్వామి చేతిలో కర్ర చూసి చల్లారిపోయాడు.

"మా మంచి మేం చూసుకోగలం వెళ్ళవయ్యా మా పిల్లని

మా యిష్టంమొచ్చినట్టు చేసుకుంటాం. నీ కెందుకా గొడవ. వెళ్ళు. ముందు బయటికెళ్ళు" అంది పార్వతమ్మ.

వీరాస్వామి కర్రని నేలకొకసారి కొట్టి ఆ కర్ర ఎంత గట్టిదో ఒకసారి చూపించాడు.

"సింహాద్రీ నీ గుట్టు నాకూ తెలుసునయ్యా. నువ్వెన్ని నీచాలు చేశావో నాకూ తెలుసు కాని మా జోలికి నువ్వు రాకపోతే నీ జోలికి మేమూరాము. నువ్వు నన్ను బెదిరించాలనుకుంటే. ఇదిగో ఇదేటో చూశావా ఈ కర్రతో తన్నులుతింటావు. తెలిసిందా. నా సంగతి నీకు తెలీదు సింహాద్రీ. నువ్వుమంచిగావుంటే నేనూమంచోడ్నే. బెదిరించావా జాగ్రత్త. ఎముకలిరగ్గొడతాను. నీలాంటి వాళ్ళని చాలమందిని చూశాను. తెలుసా ఇంకెళ్లు–ఊ–బయటికి నడువు. వెళతావా లేకపోతేదీన్తో ఒక్కటి ఒడ్డించమంటావా?" అంటూ కర్రెత్తేడు వీరాస్వామి.

సింహాద్రి భయంతో గజగజ వొణికిపోయాడు.

"బాబోయ్, కోట్టకురా వీరాస్వామీ. నువ్వూ నేనూ ఏదో ఓ కుల మోళ్ళంగాబట్టి మాటవరసకన్నాన్రా. తన్నకురా పోతాను" అంటూ కొట్లోంచి ఒక దూకు దూకి బయటపడ్డాడు సింహాద్రి.

'ఒరే సింహాద్రీ ఇదిగో ఇలారా' అన్నాడు వీరాస్వామి సింహాద్రి దిలోనే నిలబడి వెనక్కి తిరిగి చూశాడుగాని కొట్లోకిరాలేదు. కొట్లో కొస్తే తంతాడేమోనని భయం. వీరాస్వామి సింహాద్రి చొక్కా చుట్ట చుట్టి "ఇదిగో నీ చొక్కా తో పట్టుకుపో" అంటూ విసిరేశాడు సింహాద్రి చొక్కా అందుకుని గబగబ రోడ్డునాటి స్కూటరెక్కి వెళ్ళి పోయాడు.

* * * *

ఆదివారంనాడు రామారావు లక్ష్మిని మోటారుసైకిలుమీద తన స్వగ్రామానికి తీసుకెళ్లేడు.

ఆ గ్రామం పట్నానికి దగ్గరలోనేవుంది. ఊళ్ళోకి వెళ్ళాలంటే ఏరుదాటాలి వర్షకాలంలో కూడా ఏట్లో నీరు ఎక్కువగావుండదు. ఎడ్ల బళ్ళూ మనుషులూ నీటిలోంచే నడచి వెళ్ళి పోతూవుంటారు. గ్రామ ప్రజలు త్రాగేనీటికి ఈ ఏరే ఆధారం ఏటి వొడ్డున మామిడితోపులూ సరుగుడు తోటలూ దట్టంగావున్నాయి. ఏరూ. ఏటి ఒడ్డున పెద్ద మర్రి చెట్లు, వాటి దిగువ పావంచాలు. ప్రక్కనే గ్రామం ఎటికీ యింకో ఒడ్డున మామిడి సరుగుడు తోటలూ ఈ మనోహరమైన దృశ్యం చూస్తూ నిఃబడి పోయింది లక్ష్మి. రామారావు మోటారుసైకిలు నీట్లోంచి మామిడితోటలో పెట్టివచ్చాడు. లక్ష్మి చెయ్యిపట్టుకుని నీటిలోంచి నడిపిస్తూ ఏరుదాటిం చాడు. ఏరుదాటి "అమ్మయ్య. నేనిదే మొదటిసారి నీట్లోంచి నడవడం. అందుకే ఎంతో సరదాగావుంది. కాని భయంకూడా వేసింది" అన్నది లక్ష్మి. "భయమెందుకూ నీ చెయ్యి పట్టుకునే వున్నానుగా" అంటూ నవ్వేడు రామారావు. లక్ష్మి కొంచెంసిగ్గుపడింది. ఇద్దరూ నడుచుకుంటూ ఊళ్లోకొచ్చారు. రామారావు ఇల్లు డాబా ఇల్లు. విశాలమైన ఆవరణ. ఆవరణలో బంతి మొక్కలు విరగబూసి వున్నాయి.

లక్ష్మి ఆవరణలోని పూలమొక్కలన్నిటినీ శ్రద్ధగాచూసింది. "ఈ తోట ఇంత శ్రద్ధగా ఎవరేశారు" అన్నది లక్ష్మి.

"నేనేవేశాను. మావనివాడి సాయంతో కాని శ్రద్ధగా వెయ్యలేదు. ఇక్కడి మొక్కలు అడ్డదిడ్డంగా అడివిలోపెరిగినట్టు పెరిగాయి" అన్నాడు రామారావు.

"కాని ఈ తోట ఎంతో సహజంగా అందంగా ఉంది" అన్నది లక్ష్మి.

ఇంట్లోంచి రామారావు తల్లి తలుపు తీసుకొని బయటికొచ్చింది. "ఏంరా రామం ఇప్పుడే వచ్చావా? బయట నిలుచున్నావేమిటి? లోపలికి రండి" అన్నది.

"అమ్మా, ఈవిడ లక్ష్మి నాతో కలిసి చదువుకుంది టీచరుగా పని చేస్తూంది".

"రామ్మా. లోపలికిరండి" అంటూ రామారావు తల్లి లక్ష్మి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది.

ఇల్లు చాలా విశాలంగా వుంది. కొంచెం పాత పద్ధతిలో వున్నప్పటికీ పరిశుభ్రంగా వుంది. ఇంట్లో వున్న కుర్చీలు, బల్లలు కొంచెం పాతకాలం సామగ్రిలా వున్నాయి.

లోపల వరండాలో రామారావు తండ్రి కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఆయనకు ఇంగ్లీషుచదువు లేకపోయినా, తెలుగూ సంస్కృతమూ బాగా చదువుకున్న పండితుడని రామారావు లక్ష్మి కది వరకే చెప్పాడు. రామారావు తండ్రి చూడ్డానికి కూడా పండితుడిలాగే కనిపిస్తాడు. ఆజానుబాహుడు, పెద్దకళ్ళు, నుదుట గంధం దానిమీద కుంకం బొట్టు, జుట్టు ముడి, పైన కండువా కప్పుకుని గంభీరంగా వుంటాడు. ఆయన్ని చూడగానే లక్ష్మికెందుకో ఒక క్షణం భయమూ భక్తి రెండూ కలిగాయి. ఆమె తలవంచి నమస్కారం చేసింది. ఆయన ప్రతి నమస్కారం చెయ్యకుండానే సుఖీభవ అన్నాడు. లక్ష్మి అక్కడ మరి నిలబడకుండా రామారావు తల్లి వెంట వంట యింటివేపు వెళ్ళింది. వెనక వరలో ఒక వంటగది, ఒక భోజనాలగదీ, ఒక పూజ గదీ వున్నాయి. పూజ గదిలో ఒక ప్రక్క అరుగుమీద మందిరం, అందులో ఎన్నో విగ్రహాలు, దిగువన పూజ సామాగ్రీ వున్నాయి. పక్కనే దీపాలు, ఊదొత్తులు వెలుగుతున్నాయి. లక్ష్మి ఈ దృశ్యాన్ని కొద్ది

సేపు కన్నార్పకుండా చూసింది. రామారావు లక్ష్మికి యిల్లంతా చూపించాడు. ఒక పెద్ద గదిలో బీరువాలనిండా వున్న గ్రంధాలు చూసి లక్ష్మి ఆశ్చర్యపోయింది. ఇదిగో ఈ నాలుగు బీరువాల్లోని పుస్తకాలు నావి. ఈ ఆరు బీరువాల్లో వున్న గ్రంధాలు మా నాన్నగారివి. అవన్నీ తెలుగూ సంస్కృత గ్రంధాలే. వాటిలో మహాభారతం, రామాయణం, భాగవతం తదితర పురాణాలు, మేఘసందేశం, కుమార సంభవం, ఋతుసంహారం లాంటి సాహిత్య గ్రందాలు యిలాంటివెన్నో వున్నాయి. ఇదిగో నావి" అని చూపించాడు. రామారావు, రామారావు పుస్తకాలలో ఎక్కువగా ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన ఇంగ్లీషు పుస్తకాలే అయినప్పటికీ. సాహిత్య విమర్శ, ట్రావలోగ్సు ఆత్మ కథలు మొదలయిన గ్రంధాలు కూడా వున్నాయి.

లక్ష్మికి ఈ గ్రంథాలయం ఆశ్చర్యం కలిగించింది. ప్రాచీన విజ్ఞానం, ఆధునిక గ్రంథాలు ప్రక్క ప్రక్కనే సహజీవనం చేయడం ఆమెకు వింతగా వుంది.

తరువాత రామారావు లక్ష్మికి పెరడు చూపించాడు. పెరట్లో వున్న మామిడి తోట పూతపట్టి సువాసన వెదజల్లుతూ వుంది. లక్ష్మి నూతి గట్టు ఒడ్డున కూర్చుని "అబ్బ, ఎంత చక్కటి తోట" అన్నది. రామారావు కూడా ప్రక్కనే కూర్చున్నాడు. "పట్నాలలో యిరుకు సందుల్లో, గాలీ వెలుతురు రాని ఇళ్ళలో వుంటూ ఎప్పుడూ కార్లూ, బస్సుల రొద వింటూ ఒకసారి గ్రామానికొస్తే ప్రాణం లేచొచ్చినట్టే వుంటుంది. కాని మనబోటి వాళ్ళం యిక్కడే వుండాలంటే తోచక పిచ్చెత్తిపోతాం" అన్నాడు రామారావు.

"పట్నం వదిలి ఎలాగూ రాలేం. కనుక అప్పుడప్పుడు గ్రామానికొస్తూ వుండాలి".

"మా ఊరు నీకు బావుందా?"

"చాలా బావుంది"

"అలా అయితే యిక్కడికే వస్తూవుండు."

"నువ్వు తీసుకొస్తే ఎందుకు రాను."

"పెళ్ళి కాకుండా నిన్ను నాతో తీసుకురావడం మా అమ్మకీ నాన్నకీ యిష్టం లేదు. మా అమ్మ నాతో చూచాయగా అన్నది కూడాను" అన్నాడు రామారావు.

"అవును అది కూడా న్యాయమే, సమాజానికి ఏదో ఒక నీతి నియమమూ అంటూ వుండాలి కదా" అన్నది లక్ష్మి.

ఇంతలో రామారావు తల్లి భోజనానికి రమ్మని కేకేసింది. ఈ అమ్మాయి ఏ కులస్తురాలో తెలీదు. అందుకని వంట యింటిలో వడ్డించకుండా పెరటి వరండాలో యిద్దరికీ కొంచం ఎడం ఎడంగా పీటలువేసి వడ్డించింది. రామారావు ఇదంతా గ్రహించేడు కాని బయటకేమీ అనలేదు. భోజనమయాక తల్లి లక్ష్మిని విస్తరి తీసిపారేయ మంటుందేమోనని ముందుగానే రామారావు తన విస్తరి మడతపెట్టి పారేయడానికి లేవబోయాడు. లక్ష్మి అడ్డువడి, తానే రెండు విస్తళ్ళు తీసిపారేసి ఎంగిలి ఎత్తేసింది.

"మా ఇంట్లో కొంచెం ఆచారం దోసు ఎక్కువ" అన్నాడు రామారావు నవ్వుతూ.

భోజనాలయాక కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ యిద్దరూ బయలు దేరేరు. ఏరు దాటి, మామిడి తోటలో వున్న మోటారుసైకిల్ మీద పట్నం వెళ్ళి పోయారు.

• • •

మర్నాడు సింహాద్రి స్కూటరేసుకుని రామారావుండే లాడ్జికి వెళ్ళేడు. రామారావు కుర్చీలోంచి లేచి నిలబడి "ఎవరు కావాలండీ" అన్నాడు.

"నీ పేరు రామారావే కదూ, నీ కోసమే వచ్చాను బాబూ" అంటూ సింహాద్రి ప్రక్కనున్న కుర్చీలో కూలబడి "కొంచెం మంచి నీళ్ళిప్పించు" అన్నాడు. రామారావు గ్లాసుతో మంచి నీళ్ళిస్తే గడగడ తాగి కండువాతో మొహం తుడుచుకొని "ఈ ఊళ్ళో నన్నెరగని మనుషులు లేరు బాబూ. ఐనా నువ్వు నన్నెరక్క పోవచ్చునులే. కాని నిన్ను నేను ఎరుగుదును. సింహాద్రి అంటారు. ఆ వేళ వీరాస్వామి యింటి గుమ్మం దగ్గర కనిపించావు" అన్నాడు సింహాద్రి.

"అలాగా, వీరాస్వామిగారూ వాళ్ళు మీకు బంధువులా?"

'ఛ.ఛ. వాళ్ళు మాకేం బంధువులయ్యా. వీరాస్వామి మా కుల స్థుడే అనుకో. అయినా అతగాడ్ని కులంలోంచి వెలివేశారుగా'

'అయితే మీకు వాళ్ళని బాగా తెలుసునన్నమాట".

"ఆహా! తెలియకేం? వాళ్ళ కుల గోత్రాలన్నీ నాకు తెలుసు బాబూ. వాళ్ళ గుట్టంతా కూడా నాకు తెలుసు. ఆ అమ్మాయిని గురించి నీ కంటే నాకెక్కువ తెలుసు. నువ్వంటే కొత్తోడివి కానీ మేము పాతోళ్ళమే".

లక్ష్మి నేనూ కలిసి చదువుకున్నాం. చాలా మంచి మనిషి అన్నాడు రామారావు ఈ సంభాషణ యిక్కడితో ఆపేస్తాడేమోనని. కాని సింహాద్రి అక్కడితో ఆపేయడానికి రాలేదు.

"మనుషుల మంచితనం మాటలను బట్టి ఏం తెలుస్తుందయ్యా పిచ్చోడా? కులమూ, సంప్రదాయమూ, గౌరవమూ, మర్యాదా ఇలాటి

వన్నీ చూడాలి గదా, నువ్వేదో అమాయకుడి లాగున్నావు. కొంపదీసి ఆ పిల్లమీద ఏదైనా ఆశ పెట్టుకున్నా వేమిటి?"

"పెట్టుకుంటే తప్పేమిటి?"

"తప్పు లేదు గానీ, ఆ పిల్ల తల్లీ దండ్రీ వారి చరిత్ర కూడా తెలుసుకో బాబూ. నేనేదో పెద్దోడ్ని. నీ మంచి కోసమే చెబుతున్నా నయ్యా, లేకపోతే నాకేం బట్టిందిదంతా చెప్పడానికి, పీరాస్వామి మా కులస్థుడే దర్జీపని చేసేవాడు, యిప్పుడూ అదేపని చేస్తున్నాడు. ఈ పార్వతమ్మ వాళ్ళింటి పొరుగునేవుండేది. ఈ లక్ష్మిని కన్న ఆర్నెల్లకే మొగుడుపోయాడు. చాల పేదవాళ్ళు దిక్కూ మొక్కూ లేకపోతే యీ పీరాస్వామి వాళ్ళని చేరదీశాడు. అప్పట్నుంచీ వాళ్ళిద్దరూ కాపరం చేస్తున్నారు. పెళ్ళి పెడాకులూ లేవు. తెలిసిందా, ఆ తల్లి చరిత్ర మంచిది కాదయ్యా బాబూ అందుకే ఇన్నాళ్ళూపిల్లకి పెళ్ళి కాలేదు సరే ఇంతకీ ఏదో తెలీక ఆ పిల్లలతో స్నేహం చేశావు, అయినా ఇప్పటికేనా మించి పోయిందేం లేదులే, యీ గొడవలోంచి తప్పుకో, ఏదో పెద్దోడ్ని నాకు తోచిన సలహా ఇచ్చాను, ఘరేమనుకోకు ఇక నే వెళ్ళొస్తాను బాబూ" అంటూ లేచాడు సింహాద్రి. అతను గబగబ మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

రామారావు యీ కథంతా తొలిసారిగా విన్నాడు. కథ ఆసక్తి జనకంగానేవుంది. భర్త చనిపోయేక విధవ వివాహం చేసుకోవడంలో తప్పుకోలేదు. కాని వివాహమనేది లేకుండా కాపరం చేయడం వివాహ వ్యవస్థను తృణీకరించడమే అవుతుంది. వివాహ వ్యవస్థ నాగరిక సమాజ లక్షణం. దానిని త్రోసిపుచ్చడం అవినీతికదా? అయితేఇందులో లక్ష్మి చేసిన తప్పేముంది? ఆ తల్లికి పుట్టడమే ఆమె చేసిన పాపమా? కాని తాను లక్ష్మిని వివాహమాడితే ఆ వివాహాన్ని తన తల్లీ తండ్రీ ఆమోదించరు. వాళ్ళ యిష్టానికి వ్యతిరేకంగా తాను నిలబడవలసి

వుంటుంది. రామారావు ఆలోచిస్తూ మంచం మీద వడుం వాల్చేడు. సింహాద్రి రాకతో అతని మనస్సంతా గందర గోళమైంది.

సాయంత్రమైంది. అస్తమించే సూర్యుని కిరణాలు కిటికీలోంచి గదిలో కొచ్చి పడుతున్నాయి. రామారావు నిద్రనుండి లేచాడు. తలంతా భారంగా నొప్పిగావుంది. సింహాద్రి యివాళ తన రోజంతా పాడుచేశాడు. మంచంమీంచి లేచి టేబిలు డ్రాయరుతీసి అందులోంచి ఒక తలనొప్పి మాత్రతీసి నోట్లో వేసుకుని మంచినీళ్ళు తాగి మళ్ళీ మంచం యెక్కి కూర్చున్నాడు.

తలుపు చప్పుడై తే లేచి తలుపు తీశాడు లక్ష్మి లోపలికొచ్చింది. "ఏమలా వున్నావ్, సాయంత్రం అయిదు గంటలకి మా స్కూలుదగ్గర కొస్తానన్నావు, రాలేదేం? నీ కోసం చూసి చూసి ఇలా వచ్చాను."

అవును, తాను ఆ సంగతే మరచిపోయాడు.

" ఏం ఒంట్లో బాగులేదా? "

రామారావుకి అబద్ధమాడడం ఇష్టం లేదు.

" పడుకుని లేచాను, కొంచెం తలనొప్పిగా వుందంతే మరేం లేదు."

"అంతేగద. రోజంతా గదిలో నిద్రపోతున్నావు గాబోలు. నిద్ర ఎక్కువై తలనొప్పి వచ్చిందేమో" అంది నవ్వుతూ.

"లేదు లక్ష్మి, ఇప్పుడే గంటక్రితం పడుకున్నాను. ఇవాళంతా ఏ పనీ చెయ్యలేదు. వేస్టయింది. ఎవరో సింహాద్రిట. మీ నాన్నగారికి తెలిసినవాడట. ఇక్కడకొచ్చి ఒకగంటసేపు నాకు లెక్చరిచ్చి వెళ్ళేడు" అన్నాడు రామారావు.

"ఓహో, సింహాద్రి గాడొచ్చాడా? ఈమధ్య వాడు మామీదెందుకో కత్తికట్టేడులే మా స్కూలు టీచర్లతో నామీదా మా అమ్మమీదా లేనిపోని

మాటలన్నీ చెప్పేడట. పరమనీచుడు, వెధవ ఇంతకీ ఎందుకొచ్చాడు. ఏం కావాలంటాడు?"

"ఏంకావాలో చెప్పలేదు. నేనడక్కుండానే ఏదో సొదంతా ఏకరవుపెట్టేడు."

"ఏం చెప్పేడు? నాతో చెప్పకూడదా? వాడేదో చెప్పడానికే, నువ్వు దబ్గా వుండడానికీ ఏదో సంబంధం వున్నట్టుంది" అన్నది లక్ష్మి.

"నేనడక్కుండానే మీ కుటుంబ విషయాలన్నీ చెప్పుకొచ్చాడు లక్ష్మి. వీరాస్వామిగారు మీ తండ్రి కాదనీ, మీ నాన్నగారు పోయేక మీ అమ్మగారు వీరాస్వామిగారితో వుంటున్నారనీ, ఏదేదో చెప్పేడు."

"ఛి. ఆ వెధవకి సిగ్గులేదూ యీ మాటలన్నీ చెప్పడానికి నీకు నా మీద అయిష్టం కలిగించాలని వాడి వుద్దేశం ఆ వెధవని నాలుగు చెప్పుదెబ్బలు కొట్టి పంపించలేక పోయావా?" అన్నది లక్ష్మి.

"వాడివుద్దేశం నీచమైనదే కావచ్చు కాని వాడన్నదాంట్లో అబద్ధమేమైనా వుందా?"

"నిజమో అబద్ధమూ ఆ వెధవ మాటలన్నీ శ్రద్ధగా వింటూ కూర్చున్నావన్నమాట అవన్నీ వినడం నీకు సరదాగా వుందన్నమాట ఇంతకీ నాతో సంబంధం తెంపుకోమన్నాడు. అంతేనా?"

"అవును, నీ స్నేహం మానుకోమని సలహా యిచ్చాడు"

"వాడి సలహాపాటిస్తావా? నాతో స్నేహంవల్ల పరువు మర్యాదలకీ గోత్రాలకీ భంగం కలుగుతుందని భయపడుతున్నావా? ఇంత చదువుకున్న వాడివికదా. నీకు నేను ముఖ్యమో నా తల్లితండ్రులు ముఖ్యమో తేల్చుకోలేవా? నేను ఎలాంటిదాన్నో నువ్వు తెలుసుకోవాలి గాని నా వంశ మెలాంటిదో నీకెందుకు? నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? నా వంశాన్ని ప్రేమిస్తున్నావా? ఈమాత్రం నిర్ణయించుకోలేవా?"

"అనవసరంగా ఉద్రేక పడకు లక్ష్మీ, ఇంతకీ నీ స్నేహం మానుకుంటానని నే నన్నానా ?"

"అనలేదు కాని నీ మనస్సు గందరగోళంలో పడింది. నీ తల్లి తండ్రులూ, బంధువులూ యిష్టపడి నీవాళ్ళని వ్యతిరేకించవలసి వస్తుందనీ భయపడుతున్నావు అంతేనా ?"

"భయపడటం సహజమే కాని...." లక్ష్మి చేతిరుమాలుతో కళ్ళు తుడుచుకుంది.

రామారావులోని ఉత్సాహం చల్లారిపోయిందనీ, అతని మనసు దృఢనిశ్చయానికి రాకుండా ఊగిసలాడుతుందనీ అనుకుంది లక్ష్మి. ఇది తనకెంతో అవమానంగాతోచింది. పౌరుషంతో కోపంతో మనసు ఉద్రేక పూరితమైంది.

"అవును రామారావుగారూ వెళ్ళండి. వెళ్ళి మీ తల్లిదండ్రులకూ, బంధువులకూ తలొంచండి. నాతో స్నేహంచేస్తే మీకేంలాభం? మీవిద్యకూ మీ సంస్కారానికీ మంచి రాణింపువస్తుంది" అన్నది లక్ష్మి ఉద్రేకంగా కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"ఎందుకలా అర్థంలేకుండా ఉద్రేకపడతావు లక్ష్మీ, అనుమానాలకీ భయాలకీ నేను లొంగిపోతే నువ్వు నిందించినా అర్థముంది. ఇప్పుడేం కొంపమునిగిందనీ. పద లక్ష్మీ ! నీ మనసు బాగులేదు. మీ ఇంటివరకూ దిగబెట్టివస్తాను పద" అంటూ లేచాడు రామారావు.

" అక్కర్లేదు, నాకెవ్వరూ తోడురాక్కర్లేదు రామారావుగారూ, మీ కంటే నేను లక్షరెట్లు ధైర్యంగలదాన్ని. నేను ఒంటరిగా వెళ్ళగలను, ఒంటరిగానే బతగ్గలను రామారావుగారూ. నేను చెయ్యని పాపానికి నన్నెవ్వరూ నిందించక్కర్లేదు. నా మీద సానుభూతి చూపక్కర్లేదు,

జాలి పడక్కర్లేదు, వెల్తానురామారావుగారూ. మీరుండండి " అంటూ కోపంగా గబగబా నడచి బయటికెళ్ళిపోయింది లక్ష్మి.

* * *

లక్ష్మి మానసిక సంక్షోభంతో సతమతమవుతూంది. ఊళ్ళోనూ, తన స్కూల్లోనూ, తనమీద జరిగే దుష్ప్రచారం ఆమెకు బాధ కలిగించాయి. ముఖ్యంగా రామారావుఉదాసీనతఆమె మనసును గాయపరచింది. రామారావు విద్యావంతుడూ, సంస్కారవంతుడూ కావడంవల్ల చప్పున ఒక నిర్ణయానికి వచ్చి తనకు ధైర్యం కలిగిస్తాడనుకుంది. నిజానికి రామారావు లక్ష్మిలా ఉద్రేకపడేవాడు కాడు. అదే ఆమె అర్థం చేసుకోలేక రామారావును నిందించింది. తన తల్లి తండ్రీ ముందే ఈ విషయం ఎందుకు చెప్పలేదు, చెప్పివుంటే ముందే రామారావుకు చెప్పి అతని అభిప్రాయం తాను తెలుసుకొనేది. లక్ష్మికి తన తల్లిమీద కోపం వచ్చింది. ఈ గొడవ లోంచి బయటపడితేగాని తన మనసుకు శాంతి అనేది వుండదు. అందుకే తనకీ ఊరు నుంచి బదిలీ కావాలని అర్జీ పెట్టుకుంది. గుంటూరు గవర్నమెంటు గరల్స్ హైస్కూల్లో ఒక టీచరు ఈ వూరు రావాలని చాలాకాలమై ప్రయత్నం చేస్తూండటంవలన వారం రోజుల్లో లక్ష్మికి గుంటూరు బదిలీ అయింది.

లక్ష్మి ఈ వారం రోజులు యింట్లో తల్లిదండ్రులతో సరిగ్గా మాట్లాడకుండా అన్నం సరిగ్గా తినకుండా తప్పించుకు తిరగడం, ఉషారుగా లేకపోవడం పార్వతమ్మ కనిపెట్టింది. ఈ వారం రోజుల్లో రామారావు కూడా రాక పోవడంతో వీళ్ళిద్దరి మధ్య ఏదో కలతలు ఏర్పడి వుంటాయనుకుంది. వీరాస్వామి బాధ పడతాడేమోనని అతనితో లక్ష్మి విషయం చెప్పలేదు. కాని వారం రోజులైనా పరిస్థితి మారక పోవడంతో పార్వతమ్మకు భయం వేసింది. అసలు సంగతేమిటో

తెలుసుకోకుండా రోజులు గడపడం దుర్భరంగా వుంది. ఒక రోజు వీరాస్వామి లేకుండా చూసి లక్ష్మిని సంగతేమిటో చెప్పమని బ్రతిమాలింది. లక్ష్మికి ఏం చెప్పాలో తెలియలేదు. పువ్వుల్లో పెట్టి పెంచిన తన తల్లీ తండ్రీ తన కన్యాయం చేశారనీ, అవినీతిగా ప్రవర్తించారనీ చెబుతుందా? అందుకే ఏమి చెప్పకుండా తనకి గుంటూరు బదిలీ అయిందనీ, అవేళ రాత్రే బయలుదేరి వెళ్ళాలనీ చెప్పింది. బదిలీరద్దు చేసుకోడానికి ప్రయత్నించమని ఎంతో బ్రతిమాలింది తల్లి. లక్ష్మి చిరాకుగా "వెళ్ళాలి వెళ్ళి తీరాలి. నాకు వెళ్ళాలనుంది వెళతాను, అంతే" అంది మొండిగా. పిల్ల మొండితనం చూసి పార్వతమ్మకు నోట మాట రాలేదు. ఇందులో ఏదో గొడవున్నదనీ, ఇది మామూలు బదిలీకాదనీ అనుకుంది. ఈ విషయం తనే కనుక్కోవాలి, పడదీయగలిగితే ఈ చిక్కుతానే పడదీయాలి. అంతేగాని ఇది వీరాస్వామి వరకూ వెళ్ళకూడదు. అందుకే పార్వతమ్మ ధైర్యం చేసి మళ్ళీ అడిగింది.

"ఏమయిందమ్మా నీకు, ఎందుకలా మాట్లాడుతున్నావు? మేమిద్దరం కాలం మళ్ళిన వాళ్ళంకదా మమ్మల్ని వదిలి నువ్వు ఒంటరిగా వుంటావా? నీ కెవరో ఏదో చెప్పి పెట్టేరేమిటి?" అంది పార్వతమ్మ.

"నా కెవరూ ఏవీ చెప్పక్కర్లేదు, నేనేం చిన్నపిల్లనా?"

"నిజమే పెద్దదానివైనావమ్మా. అందుకే కొంచెం ఆలోచించు తల్లీ. మేమేం పాపం చేశామని మా మీద నీకేం కష్టచెప్పు? నిన్ను పెంచి పెద్దదాన్ని చెయ్యడమే మా పాపమా." అంటూ పార్వతమ్మ చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంది. తల్లి కన్నీళ్ళు చూడగానే లక్ష్మికి కూడా ఏడుపొచ్చింది.

"అలా చెయ్యకపోయినా బాగుండేదమ్మా. నన్ను చిన్నప్పుడే ఏ నూతిలోనో పారిస్తే బాగుండి పోయేది. నన్నెందుకు పెంచి పెద్ద

దాన్ని చేశారు. మీరు నేను అందరి చేత అవమానాలు భరించడానికా? మా నాన్న నేను పసిపిల్లగా వున్నప్పుడే చచ్చిపోతే నన్నుచంపి నువ్వు కూడా చచ్చిపోలేక పోయావా? ఏ నూతిలోనో పడిలేక పోయావా? నువ్వు ఎందుకీ బతుకు బతికేవు? అందుకు నేను శిక్ష అనుభవించాలా " అంటూ ఉద్రేకంతో ఉక్కిరిబిక్కిరయింది.

ఇప్పుడు పార్వతమ్మ కంతా అర్థమైంది లక్ష్మి ఎందుకు బాధ పడుతుందో తెలిసింది. ఏ విషయమైతే లక్ష్మికి తెలియకుండా వుంటే బాగుండుననుకుందో అది తెలిసింది. ఇంక యిప్పుడు చెయ్యగలిగిం దేమీ లేదు. లక్ష్మికి యిరవై ఏళ్ళొచ్చినా యింకా చిన్నపిల్లే. జీవితాను భవం లేదు. లోకాన్నీ జీవితాన్నీ అర్థం చేసుకునే స్థాయికి రాలేదు. అయినా తాను చెప్పవలసింది తాను చెప్పాలి అనుకుంది పార్వతమ్మ.

" పిచ్చి తల్లీ. నేనెందుకు బతికున్నానని అడిగేవు. చదువుకున్న దానివి కదా ఆమాత్రం అర్థం చేసుకోలేవా? మనిషి బావిలోనో పడి చావడం సుళువేనమ్మా. బతికి బయట పడడం, పిల్లల్ని పైకి తీసుకు రావడం కష్టంగానీ, మీ తండ్రి చచ్చిపోయాక అర్నెల్ల పాపను పెట్టు కుని దిక్కులేక తిండికి మలమల మాడుతూ నిస్పృహతో ఆత్మహత్య చేసుకుందామనే అనుకున్నానమ్మా. కాని నా కక్కడ ఆశ్రయం దొరికిం దమ్మా. అభయం లభించింది మనిషిగా బతికే అవకాశం వచ్చింది. మనిషి చచ్చి సాధించేదేమీ లేదనీ, బతికి జీవితం సార్థకం చేసుకోవా లనీ నిశ్చయించుకున్నాను. బి ఏ లూ ఎమ్.ఏ.లూ చదివిన వాళ్ళలోనూ, వేలూ లక్షలూ డబ్బు గడించిన వాళ్ళలోనూ లేని సంస్కారం వీరా స్వామిలో నాకు కనిపించిందమ్మా. మేమిద్దరం ఒకే లక్ష్యంతో కలసి వున్నామమ్మా. నిన్ను పెంచి పెద్ద చదువు చెప్పించి వృద్ధిలోకి తేవడానికి మేం బతికేం తల్లీ, అందుకోసమే మేము లోకాన్ని లెక్క చేయలేదు.

మనుషుల్ని సహజమైన బతుకు బతకనీయకుండా హాని చేసే లోక నియమాలను మేము లక్ష్యపెట్టలేదు తల్లీ. ఇందులో నేను సిగ్గు పడవలసిందేమీ లేదమ్మా. మనం ఇతరులకు అపకారం చేస్తే సిగ్గుపడాలి గానీ మంచిపని చేయదలుచుకున్నప్పుడు సిగ్గు పడక్కర్లేదు ఇంకొకరికి భయపడక్కర్లేదు. నిజానికి నిన్ను ఇంతదాన్ని చేయగలిగినందుకు, మేము సంతృప్తిగా బతికి మా బతుకులు సార్థకం చేసుకున్నందుకు మాకెంతో గర్వంగా వుందమ్మా" అన్నది పార్వతమ్మ. తల్లి చెప్పిన మాటల్లో ఏదో నిజం, ఏదో ఒక కఠినమైన సత్యం వున్నట్లు అనిపించింది లక్ష్మికి.

కాని ఏమైనా సరే కొన్నాళ్ళపాటు ఈ ఊరు వొదిలి వెళ్ళడమే మంచిదనుకుంది. ఊళ్ళో వాళ్ళకీ, రామారావుకీ కొన్నాళ్ళు దూరంగా వుంటేగాని తన మనసు శాంతించదు. అందుకే తాను రాత్రి గుంటూరు ప్రయాణం మానుకోలేనని చెప్పింది.

లక్ష్మి మనసు మెత్తబడిందని గ్రహించింది పార్వతమ్మ. క్రమంగా లక్ష్మి ఈ గందరగోళంలోంచి బయట పడగలదనే నమ్మకం కలిగింది.

"సరే వెళ్ళమ్మా. కేవలం కాలేజీ చదువుల వల్ల లాభంలేదు తల్లీ, కొంత అనుభవంకూడావుండాలి. నీకే కొరతాలేకుండా, ఏకష్టం తెలియనీయకుండా నిన్ను పెంచుకొచ్చాం తల్లీ. అదే మేముచేసిన పొరబాటేమో అందుకే బతుకనేది ఎంత గతుకులదారో నీకుతెలీదు. అది సరేగాని నిన్ను నేను కోరేదొక్కటే. నీ దృష్టిలో నేనంత నీచురాలినైనా తల్లిని గాబట్టి యీ కోరిక చెల్లించు. ఇప్పుడు నాదగ్గర మాట్లాడినట్టుగా మీనాన్న దగ్గర మాట్లాడకు అయన వెంటనే గుండాగి చచ్చిపోతారు. ఎందుకంటావా? నిన్ను పెంచింది నిజానికి నేనుకాదమ్మా, ఆయనే నువ్వాయన

భుజాలమీద పెరిగి పెద్దదానివయావు. తను పెంచి పోషించిన బిడ్డ తన్ను కత్తితో పొడిచినట్టుగా బాధపడతారాయన. బదిలీ అయింది వెళ్ళాలని చెప్పు సాధ్యమైనంత వేగంగా మళ్ళీ యీ ఊరికి బదిలీ చేయించుకుని వచ్చేస్తాననిఅబద్ధమాడు తల్లీ ఆయనప్రాణం నిలబెట్టడానికే నువ్వీఅబద్ధ మాడాలి. అదొక్కటే నేను కోరుకుంటున్నానమ్మా, ఆయన మనసు నీ కంటెనా కుబాగా తెలుసు తల్లీ. ఆయన దేవుడి లాంటివాడు. నీకు తెలీదు." అన్నది పార్వతమ్మ.

"అలాగేనమ్మా, నాన్నసంగతి నాకు తెలుసు" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది లక్ష్మి.

"సరే అయితే లే బట్టలు సర్దుకో-" అంది పార్వతమ్మ.

"మీకు కావాలంటే ప్రతినెలా డబ్బు పంపుతాను."

"పిచ్చి తల్లీ, నీ డబ్బు మాకెందుకమ్మా, ఈ ఇరవై ఏళ్ళూ నీ డబ్బుతోనే బతికేమా తల్లీ. అంతే కాదమ్మా కష్టపడి నీ కోసమే, ఉన్న దాంట్లో కొంత మిగిల్చి వెనకేశాం. నీకు డబ్బు అవసరమైతే వ్రాయి, ఇబ్బంది పడకు పంపిస్తాం" అంది పార్వతమ్మ.

"అమ్మా" అంటూ లక్ష్మి తల్లి గుండెలమీద తలపెట్టి ఏడ్చింది. "నా మనసంతా పాడైందమ్మా. కొన్నాళ్ళు ఒంటరిగా వుంటే మామూలు మనిషి నవుతానేమో," అన్నది.

"సరేలే తల్లీ. అలాగే వెళ్ళు. కాని నిన్ను ఒక్కర్తినే నేను పంపలేనమ్మా. పోనీ మన పనిమనిషి గౌరమ్మ వస్తే నీతో తీసుకెళ్ళు. దానికెవ్వరూ లేరులే మనిషి బాగా నమ్మకస్తురాలు. వస్తుందేమో అడుగుతాను" అంటూ పార్వతమ్మ లోపలి కెళ్ళింది.

గౌరమ్మను లక్ష్మితో పంపడానికి నిశ్చయమైంది. వీరాస్వామి పార్వతమ్మా స్టేషనుకు వెళ్ళి లక్ష్మిని బండెక్కించి వచ్చారు.

లక్ష్మి తాను కులాసాగా వున్నావని వుత్తరాలు రాస్తున్నా వీరా స్వామికేదో దిగులు వుండేది. "నెల్లాళ్ళయింది. పాపనొకసారి రమ్మని వ్రాయి పార్వతమ్మా" అనేవాడు. పార్వతమ్మ "అంత కూతుర్నివొదిలి వుండలేని వాడివి దాన్తో నువ్వు కూడా వెళ్ళిపోలేక పోయావ్" అంటూ కసిరేది కాని నిజానికి లక్ష్మి ఒక్కర్తె అక్కడేం అవస్థలు పడుతుందో అని పార్వతమ్మకూ్కడా బెంగగానే వుండేది.

లక్ష్మి యింట్లో లేకపోవడంతో వీరాస్వామిలోని హుషారంతా పోయింది. పని మీద అసక్తి తగ్గిపోయింది. పొద్దున్నే ఒకసారి కొట్టుకెళ్ళి పొట్టి కుర్రాడికి పనులు బెత్తాయించి మళ్ళీ తన గదిలో కెళ్ళి మంచం మీద చుట్ట కాల్చుకుంటూ కూచునేవాడు. పొట్టి కుర్రాడే పని నడిపించేవాడు. వాడికిప్పుడో పదేళ్ళ సాయిబుల కుర్రాడు అసి స్టెంటుగా దొరికాడు.

"నువ్విలా యిక్కడ చుట్ట కాల్చుకుంటూ కూర్చుంటే కొట్టులో బేరాలు పోతాయి. అక్కడికే వెళ్ళి కూర్చోరాదూ" అనేది పార్వతమ్మ.

"పోతే పోనీ ఏ మొస్తే అదే చాలు కుర్రాళ్ళు చూసుకుంటున్నా రుగా. మన డబ్బు పాప కక్కర్లేని తరవాత డబ్బారికే గడించి ఏం చెయ్యాలి. అది ఎక్కడికో వెళ్ళి ఉద్యోగం చెయ్యకపోతే వొచ్చిన నష్టమేమిటి చెప్పు. బదిలీ తప్పదనుకుంటే ఉద్యోగం మానీమని చెప్ప లేక పోయావా? పాప నొదిలి నేనుండలేనని తెలుసు ఎందుకు పంపిం చావు. నీదే తప్పు, అని విసుక్కునేవాడు వీరాస్వామి. వీరాస్వామి కూతురుకోసం బెంగ పెట్టుకున్నాడని పార్వతమ్మకు తెలుసు? అందుకే అతను షాపులో కూర్చుంటే వచ్చే పోయే వాళ్ళతో ఏదో కాలక్షేపం అవుతుందని తను అలా అనేది కాని లాభం లేకపోయేది.

రోజురోజుకీ వీరాస్వామి పరిస్థితి మరింత దిగజారడం మొదల యింది. దగ్గు ఆయాసం కూడా రావడం ప్రారంభమయాయి. వీరా

స్వామి ఆరోగ్యాన్ని గురించి బెంగపెట్టుకోవడం యిప్పుడు పార్వతమ్మ వంతు అయింది. ఈ విషయం లక్ష్మికి రాస్తే అదేమి బాధ పడుతుందో అది వ్రాయలేదు. కాని ఎలాగయినా లక్ష్మి మనసు మార్చి తీసుకురాక పోతే వీరాస్వామి ఏమవుతాడో అని భయం పట్టుకుంది పార్వతమ్మకి. ఈ సందర్భంలో తనకు రామారావు, సుగుణ సాయపడ గలరేమోనని ఆలోచన వచ్చింది. మధ్యాహ్నం రహస్యంగా పొట్టి కుర్రాడ్ని పిలిచి తానొకసారి రమ్మంటున్నానని రామారావుకీ సుగుణకీ కబురు పంపింది.

మధ్యాహ్నం రామారావు వచ్చేసరికి వీరాస్వామి నిద్రపోతున్నాడు పార్వతమ్మ రామారావుని వెనక గదిలోకి తీసుకెళ్ళి విషయమంతా చెప్పింది. లక్ష్మి మనసు పాడవడానికి కారణమడిగింది. రామారావు అంతా వివరంగా చెప్పేడు. సింహాద్రి దీనికి కారణమన్నాడు. లక్ష్మి మనసు నొప్పించే మాటేది తాను అనలేదనీ తానే ఉద్రేకంతో సతమత మైందనీ చెప్పేడు. లక్ష్మి తనను అపార్థం చేసుకుంది గానీ తనకు మాత్రం ఎలాంటి దురభిప్రాయం లేదని చెప్పేడు. రామారావు చిన్న వాడయినా సంస్కారమున్న వాడు కాబట్టీ పరిస్థితిని అర్థం చేసుకో గల డనే ధైర్యం వుంది పార్వతమ్మకు.

"నాయనా నువ్వు చదువుకున్న వాడివి. ఈ లోక నియమాలు ఎంత కృత్రిమంగా వుంటాయో నువ్వర్థం చేసుకోగలవు. మనుష్యుల మధ్య సంబంధాలు ఆ నియమాల ప్రకారమే పెంపొందాలంటారు గాని ఒక్కొకసారి ఆ నియమాలు అర్థం లేనివిగా, మూఢ నమ్మకాలుగా వున్నప్పుడు కూడా వాటిని అతిక్రమించకూడదంటారు. బలహీనులు అతిక్రమిస్తే వాళ్ళని నాశనం చేయాలని చూస్తుందీలోకం. కాని అదే బలవంతుడయితే డబ్బూ పలుకుబడి వున్నవాడయితే వాడినేమీ చెయ్య లేదు. అలాంటివాడు మర్యాదస్తుడుగానే చలామణి అవుతాడు, మాట

వరసకి ఆ సింహాద్రిగాడినే చూడు. అబద్దాలాడుతాడు. అన్యాయాలు చేస్తాడు. కొంపలు కూలుస్తాడు. అవినీతిగా ప్రవర్తిస్తాడు. అయినా లోకం అతన్ని తప్పు పట్టదు. ఈ పార్వతమ్మనే తప్పు పడుతుంది. వాళ్ళ దృష్టిలో ఈ పార్వతమ్మ చేసిన తప్పల్లా మొగుడు పోయాక నలుగురిళ్ళలోనూ పాచిపని చేసుకుంటూ, అందరిచేత అవమానాలు భరిస్తూ హీనంగా బతక్కుండా, తలెత్తుకుని స్వతంత్రగా తృప్తిగా బతకడమే. నాకాశ్రయమిచ్చి ధైర్యమిచ్చి బతుకుమీద ఆశ కల్పించిన ఒక సత్పురుషుడితో కలిసి పిలని పెంచి పెద్ద చదువు చెప్పించి జీవితాన్ని సార్థకం చేసుకోవడమే నేను చేసిన తప్పు. నాయనా! నీకు పీరాస్వామి సంగతి తెలియదు. నీతులు చెప్పే అనేకమంది పెద్దలకంటే మంచివాడు రెండవ పెళ్ళి చేసుకుని తమ మొదటి భార్యల పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తే పెద్దమనుషుల కంటే మంచివాడు. హృదయం వున్నవాడు. బాబూ! నువ్వు సంస్కారం వున్నవాడిని. నువ్వే లక్ష్మికి కళ్ళు తెరచి వాస్త వాన్ని చూడగలిగేటట్టు చెయ్యాలి'' అన్నది పార్వతమ్మ.

"నాకర్థమైంది అమ్మగారూ! నేను రేపే గుంటూరు వెళతాను" అన్నాడు రామారావు.

"ఎవరూ పార్వతమ్మా వచ్చారూ?'' అంటూ కేకేశాడు పీరా స్వామి.

పార్వతమ్మ రామారావుని పీరాస్వామి దగ్గరకు తీసుకొచ్చి "రామారావుగారు రేపు గుంటూరు వెళ్తున్నారట. పావని చూసి రమ్మం టున్నాను అంది.

'' ఓ, అలాగా బాబూ! మాకు లక్ష్మిని వదిలి వుండడం అలవాటు లేదు బాబూ! దానికీ ఒంటరిగా వుండడం అలవాటు లేదు. కాని ఏదో

చిన్నతనం దానికి తెలీదు. నువ్వు మళ్ళీ ఎప్పుడు తిరిగొస్తావు" అన్నాడు వీరాస్వామి.

"ఓ రెండు మూడు రోజుల్లో తిరిగొస్తానండీ!"

"అలా అయితే అమ్మాయిచేత సెలవుపెట్టించి తీసుకురా బాబూ! అసలీ వూరికి బదిలీ ప్రయత్న మేమయిందో కనుక్కో."

"అలాగేనండి."

"నాకు యీమధ్య ఆరోగ్యం బాగుండడంలేదు బాబూ! రాత్రుళ్ళు జ్వరంకూడా వస్తూంది."

"ఇదిగో నాయనా కూతురికోసం బెంగెట్టుకుని మంచంపట్టేశారు. లోకంలో ఈయన కొక్కరికే కూతురున్నట్టు" అన్నది పార్వతమ్మ.

"అందరి సంగతే నాకు తెలీదు కాని నాకు మాత్రం నా కూతురు నాదగ్గరేవుండాలి నాకళ్ళకు కనిపిస్తూవుండాలి. తెలిసిందా పార్వతమ్మా! నాకందులో చిన్నతనమేమీలేదు" అన్నాడు.

సాయంకాలం స్కూలు వదిలిపెట్టేక సుగుణ వచ్చింది. లక్ష్మి లేవగానే ఇంట్లో వాళ్ళందరూ దిగాలు పడివుండడమూ, వీరాస్వామి మంచం పట్టడమూ చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది సుగుణ. నలుగురూ కూర్చుని రామారావు ప్రయాణంగురించి చర్చించారు. రామారావుతోబాటు పార్వతమ్మనికూడా వెళ్ళమని సుగుణ సలహాయిచ్చింది. వీరాస్వామిని వదిలివెళ్ళడం పార్వతమ్మ కిష్టంలేదు. అతని ఆరోగ్యం బాగులేదు కూడాను. చివరికిఅంతా ఒక నిర్ణయానికివచ్చారు. రామారావు వెళ్ళడానికి వెళ్ళి లక్ష్మిచేత సెలవుపెట్టించి తీసుకురావడానికి నిశ్చయమైంది.

గుంటూరులో లక్ష్మికి అంతా కొత్తగావుంది. ఒక చిన్నయిల్లు అద్దెకు తీసుకుని తనూ వనిమనిషీ వుంటున్నారు. స్కూలుకు వెళ్ళడం,

యింటికిరావడం వండుకోవడం, తిని పడుకోవడం-వేరే మరేమీపనిలేదు. లక్ష్మికిక్కడ నెలరోజులకే బోర్ కొట్టేసింది. పరిచయస్తులూ, స్నేహితులు ఎవ్వరూలేరు. ఈ నెలరోజుల్లోనూ లక్ష్మికి వాళ్ళ స్కూల్లో పనిచేసే కామాక్షమ్మగారితో మాత్రమే కొంచెంసాన్నిహిత్యం ఏర్పడింది కామాక్షమ్మే వీరికి యిల్లు చూసిపెట్టింది. ఆవిడకూడా ఆ వీధిలోనే వుంటూంది.

ఆవేళ ఆదివారం ఇంట్లో కూర్చుంటే విసుగేస్తూంది. అందుకే కొంచెం కాలక్షేపంగా వుంటుందని వంట తానేచేస్తూంది. పొయ్యిమీద బియ్యం వడేసి వచ్చి పేపరు చదువుతూ కూర్చుంది. చాలసేపయాక అన్నం సంగతి జ్ఞాపకమొచ్చింది. వెంటనే "గౌరమ్మా గౌరమ్మా" అంటూ కేకేసింది. "గౌరమ్మా అన్నం పొయ్యిమీద మరచిపోయాను మాడిపోయిందేమో చూడే."

"అవునమ్మా కొంచెం మాడినట్టుంది. అయినా మీకు వంట చేతకాదమ్మా. రేపట్నించి నే చేస్తాలేండమ్మాగారూ, మీకు చేతగాదు" అన్నది గౌరమ్మ విసుక్కుంటూ.

"బాగా అన్నావ్ గౌరమ్మా. అమ్మ వండితే హాయిగా తినేదాన్ని ఇప్పుడు చేతులు కాల్చుకోడం, అన్నం మాడిపోవడం."

"ఇవన్నీ ఎందుకొచ్చిన పాట్లు సెప్పండీ. హాయిగా మిమ్మల్ని పువ్వుల్లో పెట్టినట్టు సూసుకునే అమ్మగారూ అయ్యగారూ వుండగా మీ కెందుకొచ్చినపాట్లు సెప్పండీ. పదండమ్మా మళ్ళీ బదిలీ చేయించుకు పోదాం."

"సరే లేవే, రోజూ ఒకటేపోరు పెట్టేస్తున్నావు."

"అదేదో వేగం కానీండమ్మా. నేనిక్కడేదో అడివిలో వున్నట్టున్నాను. తెలిసిన మొగమే కనవడదు."

"అది సరేగాని. నేనలా కామాక్షమ్మగారింటికి వెళ్ళొస్తాను. ఇప్పుడే అరగంటలో వచ్చి ఫోంచేస్తాను తలుపేసుకో'' అంటూ లక్ష్మి కామాక్షమ్మ గారింటికి వెళ్ళింది.

"రామ్మా, లక్ష్మీ'' అంటూ ఆహ్వానించింది కామాక్షమ్మకు నలభైకి పైగా వుంటుంది వయసు, యవ్వనంలోనే వైధవ్యం సంప్రాప్తించడం వల్ల ఎవరిమీదా ఆధారపడడం యిష్టంలేక చదువుకుని ఉద్యోగం చేసుకుంటూంది.

''వంటయిందా లక్ష్మీ'' అన్నది కామాక్షమ్మ.

"అయిందండీ, పరధ్యాన్నంగా పేపరు చదువుతూ కూర్చున్నాను. అన్నం కొంచం మాడిపోయింది. మా గౌరమ్మ నామీద మండిపడుతూంది.

"మీ అమ్మా నాన్న దగ్గిరుండటం మానేసి ఇక్కడెందుకుండడం అంటుంది మళ్ళీ మా వూరు వెళ్ళిపోదామని గొడవచేస్తూ వుంటుంది."

"మీ పనిమనిషి అన్నదాంట్లో కొంత నిజం వుందమ్మా, ఏమిటంటావా? మనిషనేవాడు సంఘజీవి. ఒంటరిగా ఇతరులతో తన సంబంధాలు పెంచుకోకుండా బతకలేడు. ఒంటరిజీవితం ఎంత దుర్భరమైనదో నాకు స్వానుభవం వల్ల తెలుసునమ్మా. నా భర్త నాతో రెండేళ్ళు కాపరం చేసి చనిపోయాడు. మాకు పిల్లలు లేరు. మాది పూర్వాచార కుటుంబం అదీగాక భర్తతో కాపరం చేసి విధవ అయిన స్త్రీని ఎవరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారు? పది మంది పిల్లలున్న రెండో పెళ్ళి వాడికి కూడా పద్దెనిమిదేళ్ళ కన్యే కావాలి. మన సమాజంలో ఎప్పుడూ నీతి అనేది .పురుషుడికి అనుకూలంగానే వుంది, స్త్రీకి సహజమైన మానవ సంబందాలు పెంచుకోనివ్వదే సమాజం'' అన్నది కామాక్షమ్మ.

కామాక్షమ్మ జీవితంలో ఎంత అసంతృప్తి దాగి వుందో లక్ష్మికి అర్థమయింది. ముఖ్యంగా ఆ రోజెందుకో కామాక్షమ్మ అంత హుషారుగా లేదు. లక్ష్మికి నిజంగా ఆవిడమీద జాలి కలిగింది. ఈ విషయాలగూర్చి మాట్లాడి ఆవిడ మనసు మరింత కష్టపెట్టగూడదనుకుంది లక్ష్మి. అందుకే లేచి ఎదురుగా వున్న పుస్తకాల బీరువాలోని పుస్తకాలు చూడడం మొదలెట్టింది బీరువా దిగువ అరలో వైలిన్ పెట్టె కనిపించింది. ఆమె ఆ పెట్టె బయటికి తీసి టేబులు మీదపెట్టి మూత తీసి చూసింది.

"మీరు వైలెన్ వాయిస్తారా కామాక్షమ్మగారూ"

"ఏమలా అడుగుతున్నావమ్మా. వైధవ్యం వచ్చిన వాళ్ళు వైలిన్ వాయించకూడదని ఏదయినా రూలుందా కొంపతీసి" అంటూ నవ్వింది కామాక్షమ్మ, ఆవిడది చలోక్తిగా అన్నప్పటికీ తనకన్యాయం చేసిన సమాజం పట్ల ఆవిడకెంత కసివుందో లక్ష్మికి అర్థమైంది.

"అదీ కాదు కామాక్షమ్మగారూ! మీకు సంగీతమొచ్చునని నాకిదీ వరకు తెలీదు. నాకు సంగీతమంటే ఎంతో ఇష్టం. మా నాన్న నేనూ ఇంటరుకు వచ్చేవరకు చెప్పించాడు."

"మీ నాన్నగారికి సంగీతమంటే ఇష్టమన్నమాట."

"అయ్యో! ఆయన పూర్వం నాటుకాల్లో హార్మోనియం వాయించేవారు. నాకు సంగీతంలో మొట్టమొదటి గురువు ఆయనే. తరవాత కీర్తనలు రాగాలాపన స్వరకల్పన నేర్చుకున్నాను."

"అయితే మరేం మన స్కూల్లో మనమో కచేరి ఏర్పాటు చేద్దాం. నువ్వు గాత్రం నేను పక్క వాయిద్యం" అన్నది కామాక్షమ్మ.

"నాకు ప్రాక్టీసు తప్పిపోయిందండీ! నా వల్ల లాభం లేదు" అన్నది లక్ష్మి.

"నేను ప్రాక్టీసు చేయిస్తాలే. ఓరెండు మాసాలు సాధనచేస్తే మళ్ళీ అదే దారిలో పడుతుంది."

కామాక్షమ్మ వైలిన్ తీసి సృతి సరిచేసింది.

"ఏదీ ఒక్క కీర్తన పాడు. గొంతుకెలా వుందో చూదాం" అన్నది. "సరే అరేళ్ళ తరువాత మళ్ళీ పాడుతున్నాను" అంటూ లక్ష్మి "సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే అనే ధన్యాసి రాగ కీర్తన పాడింది.

"బాగుందమ్మా మంచి సృతి లీనమైన గాత్రం" అంటూ మెచ్చుకుంది కామాక్షమ్మ.

ఇంతలో తలుపు చప్పుడయింది. కామాక్షమ్మ తలుపు తీసింది. గౌరమ్మ లోపలికొచ్చి "మీ వూరునుంచి రామారావు గారొచ్చినారు. మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నది.

"నేనింక వెల్తాను కామాక్షమ్మగారూ! మా వూరినుంచి ఎవరో వచ్చారట" అంటూ లక్ష్మి గౌరమ్మతో కలిసి ఇంటికి వచ్చింది.

"ఓహో రామారావు మహాశయులా? ఏమిలా దయ చేశారు? ఎప్పుడు రాక, ఏమిటి సంగతి? గౌరమ్మా, వీలయితే ఓ రెండు కప్పులు టీ కాచియ్యి, రామారావుగారికి కూడా వంట ప్రయత్నం చెయ్యి. తెలిసిందా?" అంటూ కేకేసింది లక్ష్మి.

"ఇద్దరికీ వంట చేసేనమ్మా, ఇదిగో టీ నీల్లు పెడతాను" అంటూ లోపలి కెళ్ళింది గౌరమ్మా.

"కూర్చో నిలబడ్డావేం, ఊరినుంచి ఇదేనా రావడం?" అన్నది లక్ష్మి.

"అవును లక్ష్మి."

''ఈ మధ్య ఎప్పుడేనా మా యింటివేపు వెళ్ళేవా? అంతా బావున్నారా?'' అంటూ లక్ష్మి రామారావు మొహంలోకి చూసింది.

''వెళ్ళేను లక్ష్మీ, ఒక సారేళ్ళేను. మీ అమ్మగార్ని నాన్నగార్ని చూసేసరికి గుండె చెదిరిపోయింది. ఇద్దరూ నీ కోసం బెంగపెట్టుకుని దేనిమీదా అసక్తిలేకుండా బతకడం కోసమే బతుకుతున్నారు. మీనాన్న కాలె పని మానేసి ఎప్పుడూ చుట్టకాల్చుకుంటూ మంచంమీదే వుంటారు. కుర్రాళ్ళే షాపువనంతా చూస్తున్నారు. అప్పుడప్పుడు మీ అమ్మగారే వాళ్ళకి సాయం చేస్తున్నారు. పాపం, ఆవిడా బాగా చిక్కిపోయారు. ఇద్దరూ నన్ను చూసి కంట తడిపెట్టుకున్నారు.''

''అవును, నన్నొదిలి వుండడం వాళ్ళకలవాటులేదు.''

''మీ అమ్మగారినీ నాన్నగారినీ చూస్తే ఈ లోకంలో కులాలూ మతాలూ పెళ్ళిళ్లూ పేరంటాలూ-యిలాంటి సాంఘికమైన కట్టుబాట్లేవీ సాధించలేని మంచితనమేదో సాధించారనిపిస్తుంది లక్ష్మి'' నా మట్టుకు నేను వారినుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాననిపిస్తోంది. మంచితనాన్నీ, నాగరికజీవితాన్నీ సాధించడానికి కుద్దేశించబడిన సాంఘికమైన కట్టుబాట్లు కాలక్రమాన మూఢనమ్మకాలుగా మారి మన కళ్ళకు పొరలు వేశాయి లక్ష్మి. అందుకే మనం దీపాన్ని చూడలేక అది కనబడడం లేదని దాన్ని నిందిస్తాము. మీనాన్న అమ్మా విషయంలో నాలాగే నువ్వు కూడా పొరబడ్డావు లక్ష్మి

''మా నాన్న ఆరోగ్యం ఎలావుంది?''

''అంతగా బాగులేదని అన్నారు. రాత్రుళ్ళు దగ్గూ జ్వరం వహిస్తోందట.''

ఇంతలో గౌరమ్మ టీ తెచ్చి ఇచ్చింది. టీ తాగేరు.

''అయితే నాన్న మందు పుచ్చుకుంటున్నాడా.''

"ఆ మందులువాడుతూనే వున్నారనుకో కాని ఆయన అనారోగ్యా నికి అసలు కారణం నీ గురించి బెంగపెట్టుకోవడమే. నువ్వెళ్ళిన దగ్గర నుంచీ ఆయన మతిపోయినట్టున్నారట. నువ్వెప్పుడూ కంటికి కనిపిస్తూ వుండాలట. లక్ష్మి, ఆయన నీ తండ్రికాదని బాధపడ్డవు. కాని ఏతండ్రికీ తన కూతురిమీద ఇంత మమకార ముంటుందనుకోను, ఆయన నీకు తండ్రికాదు నిజమే కాని తండ్రి గంటే గొప్పవాడు లక్ష్మి. నువ్వు తెలుసుకోలేకపోయావు."

లక్ష్మి యింకేమీ మాట్లాడలేదు. చీరకొంగుతో కళ్ళనీళ్ళు తుడుచు కుంది. ఆమె మనసు తండ్రిపట్ల అనురాగంతో నిండిపోయింది. "అవును రామారావుగారూ నాకళ్ళ కెవరో పొరలువేశారు. నిజాన్ని చూడలేని గుడ్డితనం తెచ్చిపెట్టేరు" అన్నది లక్ష్మి దుఃఖతో ఉక్కిరి బిక్కిరవుతూ.

"ఎవరో కాదు లక్ష్మి తరతరాలుగా మార్పు చెందని అర్ధరహిత మైన నీతి నియమాలే. వాటి ఆసరాలతోనే సింహాద్రిగాడీ గొడవంతా లేవదీసి నీమనసు విరిచేడు. నిన్ను తనకిచ్చి పెళ్ళిచెయ్యమని మీవాళ్ళతో తగువుపెట్టుకున్నాడట. మీ అమ్మా నాన్నా వాడ్ని తిట్టి బయటికి తరిమే, రట. ఆ పగ సాధించాడు వాడు."

"వాడ్ని నడివీధిలో చెప్పుతీసి కొట్టాలి, వెధవ" అంది లక్ష్మి కోపంగా.

"అక్కర్లేదు, మనమో పనిచేస్తే వాడిని చెప్పుదెబ్బ కొట్టినట్టే అవుతుంది. దీనికి మీ అమ్మగారే మనకి ఆదర్శం. ఆపిద తలెత్తి ధైర్యంగా నిలబడి యిలాంటి సింహాద్రుల కెందరికో చెప్పుదెబ్బలు కొట్టేరు."

"అంటే, నువ్వనేదేమిటి?"

"మనిద్దరం పెళ్ళిచేసుకుంటే వాడ్ని అవమానించినట్టే కదా! మీ అమ్మగారన్నారు కూడాను."

"ఏమిటంది?"

"మనిద్దర్నీ పెళ్ళిచేసుకోమన్నారు. నాకు ఉద్యోగంలేదు. ఎలా చేసుకోమంటారన్నాను. పెళ్ళికీ ఉద్యోగానికీ సంబంధమేమిటన్నారు. అడదాని ఉద్యోగంలేకపోయినా మగాడ్ని చేసుకోడంలేదా? అన్నారు."

"నువ్వే మన్నావ్,"

"లక్ష్మి కిష్టమైతే చేసుకుంటానన్నాను." లక్ష్మి నవ్వి" మంచి తెలివిగా తప్పించుకున్నారే అంది.

" అది సరేగాని నన్ను నువ్వు నీవనీ మీరనీ కూడా అంటు వుంటావే చిత్రంగా వుంది" అంటూ నవ్వేడు రామారావు.

"అదా, అది నాయిష్టం, నాకు వాక్ స్వాతంత్ర్యముంది" అంటూ నవ్వింది లక్ష్మి.

గౌరమ్మ భోజనాలకి లెమ్మని కేకేసింది. రామారావు స్నానాని కని లేచేడు. పెట్టెతెరచి తువ్వాలూ పంచ బయటికి తీశాడు. వాటితో ఒక చిన్న పేకెట్ కూడ తీసి లక్ష్మి కిచ్చాడు. మీఅమ్మగారు నీకు గాజులు చేయించారట, నాచేతికిచ్చి పంపించారు' అన్నాడు, లక్ష్మి సంతోషముగా పేకెట్ విప్పితీసి చూసింది. "అబ్బ, ఎంత బావున్నాయి! ఏం నీకు నచ్చలేదా" అంటూ రామారావుకి చూపించింది.

"గాజుల గొడవ నాకేం తెలుసు లక్ష్మి. మూడు వందలు అయిందట, బాగుండకేం చేస్తాయి." అన్నాడు రామారావు. ఈమాటలు విని గౌరమ్మ వచ్చింది.

"సూడనీండమ్మగారు, బాగున్నాయమ్మ" అంది.

"అమ్మ చేయించి పంపించేదే" అన్నది లక్ష్మి.

"అవును కదా మనముండగానే అమ్మగారు షరాబును పిలిచి బెత్తాయించినారు. నాకు తెలదేటి" అన్నాది గౌరమ్మ. రామారావు స్నానానికెళ్ళేడు.

భోజనాలు చేస్తుండగా రామారావు అసలు విషయం కదిపేడు. లక్ష్మిని సెలవు పెట్టి బయలుదేరమన్నాడు. నెల రోజులయింది యిక్కడికొచ్చి సెలవిస్తారో యివ్వరో అని సందేహించింది లక్ష్మి. రేపు స్కూల్లో కనుక్కొని చెబుతానంది.

ఆ రోజు సాయంత్రం రామారావు లక్ష్మి, కామాక్షమ్మగారింటికి వెళ్ళేరు. "నా మిత్రుడు మిస్టర్ రామారావు, ఎమ్. ఎ. ఎకనామిక్స్ ఫస్టు క్లాస్ ఫస్ట్. అయినా యింకా ఉద్యోగంలేదనుకోండీ" అంటూ లక్ష్మి రామారావుని పరిచయంచేసింది.

"రా బాబూ కూర్చో. మా లక్ష్మికి బాగా సన్నిహితులన్నమాట. కాబట్టి మాకూ కావలసిన వారే" అంటూ ఆహ్వానించింది కామక్షమ్మ.

"కామాక్షమ్మగారూ, నిజంచెప్పాలంటే ఈయన నాకు కాబోయే భర్త" అంది లక్ష్మి.

"ఓహో, అయితే మొదట ఆమాట చెప్పాలమ్మా. సంతోషం బాబూ, కూర్చోండి, కాఫీ టిఫినూ తెస్తాను" అంటూ లోపలికెళ్ళింది కామక్షమ్మ అయితే మనిద్దరి పెళ్ళి సెటిల్ అయిపోయినట్టేనన్నమాట అంటూ రామారావు లక్ష్మి చేతిని తీసి పెట్టుకున్నాడు.

"అహా, కామాక్షమ్మగారి సమక్షంలో" అంది లక్ష్మి నవ్వుతూ.

కామాక్షమ్మ కాఫీ టిఫినూ తెచ్చిపెట్టి రామారావును పరీక్షగా చూసింది. రామారావు అందంగా, ఆరోగ్యంగావున్నాడు. నిజానికి

కామాక్షమ్మ మనసులో లక్ష్మివట్ల కొద్దిగా అసూయ కలిగింది.

"ఏమిటమ్మా లక్ష్మి ఏదో నవ్వుతూ ఆయన్నేదో వెటకారం చేస్తున్నట్టున్నావు. పాపం, అబ్బాయి అమాయకుడిలా వున్నాడు" అన్నది కామాక్షమ్మ నవ్వుతూ.

"ఏం లేదు కామాక్షమ్మగారూ, పెద్దవారు మీరు. మీ సమక్షంలో మా పెళ్ళి సెటిలయిందనుకుంటున్నాము".

"అంతకంటెనా అయితే నా అదృష్టమే."

"మిమ్మల్ని చూస్తే మా అమ్మే జ్ఞాపక మొస్తుంది" అంటూ లక్ష్మికామాక్షమ్మ పాదాలకి దండంపెట్టింది. రామారావుకూడా ఆవిడ పాదాలకి దండంపెట్టేడు. "ఇవాళ నిజంగా మిమ్మల్ని దీవించే అదృష్టం కలిగింది బాబూ, మీరిద్దరూ అన్యోన్యంగా కలకాలం కాపరంచెయ్యాలి. మీ జీవితసుఖం కోసం ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించి నిలబడాలి. ఏ భయమూ లేకుండా తలెత్తుకు నడవండి" అంటూ దీవించింది కామాక్షమ్మ.

ఆ రాత్రి అంతా అక్కడే భోజనాలు చేసి రెండో ఆట సినిమాకి వెళ్ళేరు.

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకి భోజనం చేసి లక్ష్మి స్కూలుకి బయలు దేరింది, "నీ కింట్లో తోచకపోతే ఊరంతా తిరిగి రా" అన్నది రామారావుతో. "తోచకపోతే నేనూ మీ స్కూలుకొచ్చేస్తాను" అన్నాడు రామారావు నవ్వుతూ.

"అది గరల్స్ స్కూలు నిన్ను లోపలికి రానివ్వరు. నువ్వో పెద్ద మొగాడివని వాళ్ళ భయం. అంటూ నవ్వింది లక్ష్మి.

ఇంతలో పోస్టు జవానొచ్చి యీ నవ్వులకు అంతరాయం

కలిగించాడు. వాడు లక్ష్మి చేతికి టెలిగ్రామ్ ఇచ్చిపోయేడు. లక్ష్మి టెలిగ్రామ్ చదివి భయంగా మొహం పెట్టింది.

"ఏమిటి లక్ష్మి చూపించు" అన్నాడు రామారావు.

"నాన్నకి చాలా జబ్బుగా వుందట బయలుదేరి రమ్మంటున్నారు".

గౌరమ్మ కి సంగతి తెలిసి రాగాలు తియ్యడం మొదలెట్టింది.

"అయ్యగారు మీ కోసం బెంగెట్టుకున్నారమ్మా. నేను మరుండ నమ్మా యీ వూర్లో. పదండమ్మా ఇయాలే పోదాం" అంటూ గొడవ చేసింది.

"గొడవ చెయ్యకు గౌరమ్మా నీ గొడవ వల్ల లక్ష్మి మరింత అదిరిపోతుంది. ఇవాళే బయలుదేరి వెళదాం. లక్ష్మి నువ్వు స్కూలుకెళ్ళి సెలవు పెట్టుకురా. ఇవాళ సాయంకాలం బండిలో బయలుదేరుదాం". అన్నాడు రామారావు.

లక్ష్మి మతిపోయిన మనిషిలా నిల్చుంది "నాన్న బతికున్నంత కాలం ఆయన్ని వదిలి మళ్ళీ తిరిగి రాగలా రామారావుగారూ" అన్నది. "నేను డాక్టరుతో మాట్లాడేను లక్ష్మి. అంత ప్రమాదం ఏమీ లేదని చెప్పేడు. ఆయనకి పెద్ద జబ్బేమీ లేదు. కేవలం బెంగే" అన్నాడు రామారావు. లక్ష్మి రామారావు భుజంమీద మొఖం పెట్టి ఏడ్చింది.

"ఏం భయంలేదు లక్ష్మి. పద బయలుదేరు స్కూలుకెళ్ళొద్దాము. అంటూ రామారావు లక్ష్మిని తీసుకుని రిక్షాలో స్కూలుకెళ్ళేడు".

లక్ష్మి పది రోజులు సెలవు పెట్టింది. ఆ సాయంత్రం లక్ష్మి, గౌరమ్మా రామారావూ ఊరికి బయలుదేరేరు. కామాక్షమ్మ స్టేషను కొచ్చింది. మీ నాన్నగారి కేలాంటి ప్రమాదం రాదని నా కెందుకో అనిపిస్తుంది లక్ష్మి. మరేం భయంలేదు సంతోషంగా వెళ్ళిరా అమ్మా

మీ అందరికీ ఆయన మీదున్న అనురాగమే ఆయన్ని కాపాడుతుంది. అన్నాది కామాక్షమ్మ. "మీ ఆశీర్వాదబలం" అంటూ లక్ష్మి కామాక్షమ్మ నమస్కరించింది. రైలు కదిలింది.

లక్ష్మి వాళ్ళు యింటికొచ్చే సరికి వీరాస్వామి నిద్దరపోతున్నాడు. ఇంటికి రాగానే లక్ష్మి తల్లిని కౌగలించుకొని ఏడ్చింది. "మళ్ళీ నేను నాన్న మొహం ఎలా చూడగలనమ్మా. ఆయన్నింత బాధ పెట్టి మళ్ళీ ఏలాగ అయన దగ్గరకి వెళ్ళడం?"

పార్వతమ్మ లక్ష్మిని ఓదారుస్తూ "ఫరవాలేదమ్మా. నిన్ను చూస్తే ఆయన కెక్కడలేని బలమూ, సంతోషమూ వస్తాయి. ఆయన మనసు వెన్నలాంటిదమ్మా. నువ్వు కత్తితో పొడిచినా ఆయన సంతోషంగానే భరించగలరు". అన్నాది.

"నాన్న కెలా వుందమ్మా, డాక్టరేమన్నాడు"

"ఇవాళ కొంచం నయంగా వుందమ్మా. మరేం భయం లేదన్నాడు. కేవలం బెంగ వల్లేనన్నాడు. మీ అమ్మాయి వచ్చేక అదే తగ్గిపోతుంద న్నాడు. ఆయన నిద్ర లేవనీ వెళ్ళి మాట్టాడుదువు గాని. ఈలోగా కాఫీ కాచి తెస్తాను" అంటూ పార్వతమ్మ పొయ్యి దగ్గరకెళ్ళింది. అప్పటికే గౌరమ్మ పాత్రలు కడిగి పొయ్యి వెలిగించింది".

"గౌరమ్మా అమ్మాయి ఈనెల రోజుల్లోనూ బాగా చిక్కిపోయిందే అన్నాది పార్వతమ్మ".

"చిక్కి పోరటమ్మా. తిండి సరిగ్గా తినరమ్మా. అయమ్మే ఒండుతానంటారు, సేతులు కాల్చుకోడం, అన్నం మాడిపోడం", అంది గౌరమ్మ.

"పాపం దానికి వంట అలవాటు లేదే, గౌరమ్మా పెద్ద దానివి

నువ్వుండి కూడా అమ్మాయి విషయం పట్టించుకోక పోతే ఎలాగే? నువ్వింత వండి పడేయలేకపోయావా?"

"నన్ను వంటింట్లోకి రానీరమ్మా రోజూ మా యిద్దరికీ యిదే తగువు. అందుకే బదిలీ సేయించుకు పోదాం పదండని గొడవపెట్టేను" అంది గౌరమ్మ.

వీరాస్వామి నిద్ర లేచాడు. రామారావు వెళ్ళి పలకరించి వొంట్లో ఎలా వుందన్నాడు. ఫరవాలేదు తగ్గిందన్నాడు వీరాస్వామి.

ఇదిగోనండి మీ అమ్మాయిని తీసుకొచ్చాను. అన్నాడు రామారావు.

లక్ష్మి ఏడుస్తూ వీరాస్వామిని కౌగలించుకొని "నాన్నా" అన్నాది.

"ఏం పాపా వచ్చావా?"

"నాన్నా, నిన్నొదిలి వెళ్ళేనని బెంగతో మంచ మెక్కేవా, పాపిష్టిదాన్ని అంటూ కళ్ళు తుడుచుకుంది లక్ష్మి".

"బాగా చిక్కిపోయావమ్మా పాపా. అవూరు నీళ్ళు నీకు పడ లేదో ఏమిటో అన్నాడు వీరాస్వామి."

"ఇప్పుడెలా వుంది నాన్నా నీ వంట్లో" అన్నాది లక్ష్మి.

"తగ్గిందమ్మా. ఇంతకీ ఎన్నాళ్ళు పెట్టేవు సెలవు?"

"ఎన్నాళ్ళేమిటి నాన్నా. నీ ఆరోగ్యం కుదుటపడే వరకూ సెలవే. ఆ తరవాత వెళ్ళినా, నిన్నూ అమ్మనీ తీసుకునే వెళతాను." అంది లక్ష్మి.

పార్వతమ్మ కాఫీ తెచ్చి యిచ్చింది. "మరి కాఫీ ఎందుకూ, అమ్మాయొచ్చింది. నా కడుపు నిండిపోయింది" అన్నాడు వీరాస్వామి.

"బాగుంది, తాక్కపోతే ఏలాగ? ఇప్పుడు కాఫీ తాగేక అర గంటపోయేక మందు తాగుదురు గాని," అన్నాది పార్వతమ్మ.

"ఏయే మందు లివ్వాలో చెప్పమ్మా. నేనిస్తాను." అంది లక్ష్మి.

"ఇదిగో, ఇక మీ సేవలన్నీ మీ కూతురే చూసుకుంటుంది. నే నింట్లో పనీపాటా చూసుకోవాలి." అంటూ పార్వతమ్మ వంట గదిలోకి వెళ్ళింది.

"మీ అమ్మ దేవతలాంటిది తల్లీ, నీకు తెలీదు దాని మనసు, దాన్నెప్పుడూ కనిపెట్టి వుండమ్మా."

"అలాగే నాన్నా ఇకమీదట నిన్నూ అమ్మనీ వదిలి ఎక్కడకీ వెళ్ళను" అంటూ లక్ష్మి కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"ఇదేటీ యీ పొట్లామూ" అంటూ పార్వతమ్మ ఏదో పొట్లాం పట్టుకువచ్చింది.

"అదా, అది నాన్నకమ్మా, నాన్నా నీకు లంకపొగాకు చుట్టలు తీసుకొచ్చాను. మిఠాయి కూడా తీసుకొచ్చా నాన్నా నీ కిష్టమవి," అంది లక్ష్మి.

"ఏదీ యిలా తీసుకురామ్మా తిందాం?"

"బాగుంది వరస, జ్వరంతో మిఠాయి తింటారా? రోజు రోజుకీ మరీ చిన్నపిల్లాడైపోతున్నట్టున్నారు, నూకలజావ తప్ప ఏమీ యివ్వొద్దన్నాడు డాక్టరు. మిఠాయి తింటారట,మిఠాయి" అంటూ చీవాట్లేసింది పార్వతమ్మ.

"మీ అమ్మ తిడుతూంది ఇప్పుడొద్దులేమ్మా. మీ అమ్మ నిద్ర పోయాక తినేద్దాం" అన్నాడు వీరాస్వామి అంతా నవ్వుకున్నారు.

సాయంత్రం డాక్టరొచ్చి చూశాడు. జ్వరంబాగా తగ్గిపోయిందనీ రెండు రోజులలో నయమవుతుందనీ చెప్పివెళ్ళేడు.

తండ్రికి పళ్ళూ, మందులూ కొనటానికి లక్ష్మి బజారుకు బయలు దేరింది. రామారావు కూడా వెంట వెళ్ళేడు.

వీరాస్వామి మంచంమీద కూర్చుని పార్వతమ్మని పిలిచాడు.
"పార్వతమ్మా, రామారావు చాలమంచి కుర్రోడు, ఏమంటావు?"
న్నాడు.

"అవును, బుద్ధిమంతుడే."

"మరి పెళ్ళిమాటేమిటి తలపెట్టేవు" అన్నాడు వీరాస్వామి.

"ఏమీలేదు, పెళ్ళి చేద్దాము, ఇద్దర్నీ అడిగాను.

ఇద్దరికీ యిష్టమే. నువ్వు కొంచెం లేచి తిరిగితే ఆ ప్రయత్నం
చేద్దాము." అన్నాది పార్వతమ్మ.

"పోనీ అందాకా పనీధిలో వున్నాడే పురోహితుడు ఆయనకి
కబురు చెయ్యి. మాటాడదాం" అన్నాడు వీరాస్వామి.

పార్వతమ్మ పురోహితుడికి కబురు పెట్టింది. పురోహితుడు ఓ
పదిరోజుల్లో మంచి ముహూర్తం వుందన్నాడు. చివరికి అ ముహూర్తమే
నిశ్చయించారు.

పురోహితుడు బయటి కెళ్తూండగా రామారావు లక్ష్మీ వచ్చారు.

"ఈ జోగయ్యగారెందుకొచ్చారు నాన్నా" అనడిగింది లక్ష్మి.

పార్వతమ్మే సమాధాన మిచ్చింది. పదిరోజుల్లో ఒక పెళ్లి
ముహూర్తం నిశ్చయించామమ్మా. లక్ష్మి ఏమీ మాట్లాడకుండా రామారావు
వైపు చూసింది. రామారావు చిరునవ్వు నవ్వేడు.

"బాబూ రామారావూ, నిన్నడక్కుండా ముహూర్తం పెట్టించాము
ఐనా అభ్యంతరమా?" అన్నాడు వీరాస్వామి.

"లేదండీ, మీ యిష్టం. నాకేం అభ్యంతరం లేదు."

వీరాస్వామి మంచంమీంచి లేచి నిలుచుని రామారావు భుజంమీద
చెయ్యివేశాడు. "బాబూ, నీ విషయం నాకు తెలుసు, అందుకనే

స్వతంత్రం తీసుకుని నిశ్చయించాను. నువ్వూ, లక్ష్మీమీరిద్దరు రెండు కళ్ళలాంటివారు. మీకు వివాహమయేకకూడా మిమ్మల్ని మేముండలేము. అదొక్కటే మా షరతు'' అన్నాడు.

''అలాగే నాన్నా, ఆయనన్నదిగేదేమిటి నా యిష్టం'' అం పార్వతమ్మ నవ్వుతూ ''బాగుందే నీ వరస'' అన్నాది.

''మీ అమ్మాయికి నామీద సర్వాధికారాలు వున్నాయమ్మ అన్నాడు రామారావు

''నాయనా, మా యిద్దరికీ పెళ్ళిచేసే పెద్దలు లేకపోయారు. చేసుకోకుండా మీద సమాజం తిరగబడదామనుకున్నాం. కాని మీరి పెళ్ళి చేసుకునే సమాజంమీద తిరగబడొచ్చును. మాకు లేని యి కాశం మీకుంది నాయనా. అన్యోన్యతే మీకు ప్రధానమైంది వి మనేది దానికొక చిహ్నంగా మాత్రమే వుంటుంది,'' అన్నాది పార్వ

రామారావు లక్ష్మి, వీరాస్వామికీ పార్వతమ్మకూ నమస్క వీరాస్వామి ఆనందంతో కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు. ''మాలాగే మీకు చాతనయినంతవరకు మీ బతుకులు సార్థకం చేసుకోండి'' అ దీవించాడు వీరాస్వామి. అవును, వీరాస్వామీ పార్వతమ్మా ఏ సాధనకు కలసి బ్రతికేరో ఆ లక్ష్యం సిద్ధించింది. అదే వాళ్ళ దానికీ గర్వానికీ కారణం.